మన తొలివెలుగు

RNI· TGBIL/26/A2289

తెలుగు దినపత్రిక

www.manatolivelugu.in

CEO & Chief Editor : Vanga Nagaraj Reddy (Raju)

హైదరాబాద్ | ఆదివారం 1 నవంబర్ 2026 | సంపుటి : 1 | సంచిక : 140 | పేజీలు : 8 | వెల : 2/-





పేదరికం తగ్గింపులో భారత్ పురోగతి!

- ప్రపంచ బ్యాంక్ గణాంకాలే నిదర్శనం.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్య
- 57.7 శాతం నుంచి 16.1 శాతానికి పేదరికం తగ్గింపు
- 49.6 కోట్ల మంది పేదరిక రేఖ నుంచి బయటకు
- సంక్షేమ పథకాలతో చిపరి లబ్ధిదారుడికి ప్రయోజనాలు
- కాంగ్రెస్ పాలనతో పోల్చిన కిషన్‌రెడ్డి

హైదరాబాద్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ పాలనలో దేశంలో పేదరికం తగ్గిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. ప్రపంచ బ్యాంక్ విడుదల చేసిన పావర్టీ అండ్ ఈక్విటీ బ్రీఫ్ గణాంకాలను ఉటంకిస్తూ.. 2011 నుంచి 2023 మధ్య కాలంలో 49.6 కోట్ల మంది భారతీయులు పేదరికం నుంచి బయటపడ్డారని తెలిపారు. ఈ కాలంలో పేదరిక రేటు 57.7 శాతం నుంచి 16.1 శాతానికి తగ్గినట్లు పేర్కొన్నారు. రోజుకు మూడు డాలర్ల ఆదాయ పరిమితి ఆధారంగా - మిగతా 3లో


అన్నదాతకు నవంబర్ వానలే ఆశ!



- అడుగంటుతున్న జలాశయాలు.. ఎండుతున్న పంటలు..
- ఎండిపోతున్న ప్రాజెక్టులు.. తరుముకొస్తున్న కరువు..
- నవంబర్ అన్నదాతను ఆదుకుంటుందా..?
- ఏపీ, తెలంగాణలో వర్షాభావ పరిస్థితులు
- ఏపీలో 30.5 శాతం.. తెలంగాణలో 25 శాతం వర్షపాతం లోటు
- వానల కోసం ఎదురుచూస్తున్న రైతులు
- రబీ సాగుపై నీటి కొరత ప్రభావం
- చేతికొచ్చిన పంటను కాపాడుకోవడమే సవాల్

అమరావతి / హైదరాబాద్

వానాకాలం ముగింపు దశకు చేరుకుంటున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వ్యవసాయ రంగం ఆందోళనకర పరిస్థితులను ఎదుర్కొంటోంది. ఖరీఫ్ పంటలు చేతికొచ్చే సమయంలో పొలాల్లో తేమ తగ్గిపోవడం, చెరువులు, జలాశయాల్లో నీటిమట్టాలు పడిపోవడం, భూగర్భ జలాలు అడుగంటడం రైతులను కలవరపెడుతున్నాయి. ఇప్పటికే వర్షాభావ పరిస్థితులు నెలకొన్న ప్రాంతాల్లో పంటలను కాపాడుకోవడం కష్టంగా మారింది. మరోవైపు రబీ సాగుకు నీటి - మిగతా 3లో



బంగాళాఖాతంలో కొత్త వాయుగుండం

- ఇస్రో శాటిలైట్ కెమెరాకు చిక్కిన దృశ్యాలు
- బంగాళాఖాతంలో ఏర్పడిన కొత్త వాతావరణ వ్యవస్థ
- ఇస్రోకు చెందిన ఇన్ శాట్-3డీఎస్ శాటిలైట్ ద్వారా గుర్తింపు
- ఆంధ్రప్రదేశ్ తీరం వైపు కదులుతున్న అల్పపీడనం
- ఏపీ తీరంలో అతి భారీ వర్షాలు, ఈదురుగాలులకు అవకాశం

అఖండ భారత రూపశిల్పికి ఘన నివాళి!


- జాతి ఉక్కుమనిషి పటేల్‌కు ప్రధాని, రాష్ట్రపతి వందనం
- స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వద్ద మోదీ పుష్పాంజలి
- ఆధునిక భారత నిర్మాణంలో పటేల్ పాత్ర చారిత్రాత్మకం: ముర్ము
- దేశ ఐక్యతకు ఆయన ఆశయాలే మార్గదర్శకం: అమిత్ షా



ఇంధన సరఫరాలో ఆంక్షలు.. అడ్డంకులు వద్దు!

- జీ20 వేదికగా భారత్ గళం.. జైశంకర్ కీలక వ్యాఖ్యలు
- చమురు రవాణా మార్గాలకు ఆటంకాలు సృష్టించొద్దు
- సైనిక చర్యలతో సమస్యలు పరిష్కారం కావు.. దౌత్యానికే ప్రాధాన్యం
- ఎల్‌పీజీ సరఫరాలో స్థిరత్వం తప్పనిసరి





భారత వ్యతిరేక శక్తుల కుట్ర!

- దేశ విభజనకు ప్రయత్నాలు..
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- సోషల్ మీడియాలో అబద్ధాలు, వదంతులతో అస్థిరత సృష్టించే యత్నం
- భారతీయుల ఐక్యతే దేశానికి రక్షణ కవచం
- సర్దార్ పటేల్ 151వ జయంతి వేడుకల్లో ప్రధాని మోదీ వ్యాఖ్యలు



దిల్లీ మార్చ్‌కు రాహుల్ పిలుపు!

- అనుమతి లేదన్న పోలీసులు.. దేశ రాజధానిలో రాజకీయ వేడి
- నవంబర్ 1న రామ్‌లీలా మైదానంలో ఇండీ కూటమి భారీ ర్యాలీ
- మోదీ, అమిత్ షా, ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నిరసన
- ట్రాఫిక్ ఆంక్షలు.. భారీ భద్రతా ఏర్పాట్లు

వేలం ద్వారా నిధుల సమీకరణకు సీఎం యోచన


550 ఎకరాల భూమి.. తెలంగాణ రాజకీయాల్లో కొత్త దుమారం!

మియాపూర్ భూములపై సుప్రీంకోర్టు తీర్పు..

- వేల కోట్ల ఆస్తి వినియోగంపై కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం
- ప్రభుత్వానికి అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు
- భూమిని వేలం వేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి
- బీఆర్ఎస్ అభ్యంతరం.. భవిష్యత్ తరాల ఆస్తిని అమ్మొద్దని డిమాండ్
- 400 ఎకరాలు ఖాళీ.. 150 ఎకరాల్లో నివాసాలు
- భూముల వినియోగంపై సర్కారు నిర్ణయంపై ఉత్కంఠ

హైదరాబాద్

హైదరాబాద్ శివారు మియాపూర్‌లోని 550 ఎకరాల ప్రభుత్వ భూమి వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసింది. రెండు దశాబ్దాలకు పైగా కొనసాగిన న్యాయపోరాటానికి సుప్రీంకోర్టు తీర్పుతో తెరపడగా.. ఇప్పుడు ఆ భూముల భవిష్యత్తుపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం మొదలైంది. ప్రభుత్వానికి చెందిన విలువైన భూమిని ఎలా వినియోగించాలనే అంశం రాజకీయ వివాదంగా మారింది. మియాపూర్ గ్రామంలోని సర్వే నంబర్లు 100, 101 పరిధిలో ఉన్న సుమారు 550.39 ఎకరాల భూమిపై ప్రైవేటు వ్యక్తులు, సంస్థలు దాఖలు చేసిన అప్పీళ్లను అక్టోబర్ 29న సుప్రీంకోర్టు కొట్టివేసింది. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ.. ఈ భూమిపై ప్రభుత్వ యాజమాన్య హక్కును ధ్రువీకరించింది. భూమిపై హక్కులు - మిగతా 3లో



మోడల్ స్కూళ్లకు పబ్లిక్ స్కూళ్ల హోదా!

- రూ.787.54 కోట్లతో విద్యాశాఖ భారీ ప్రణాళిక
- 194 పాఠశాలల్లో 1 నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్య
- 2027-28 విద్యా సంవత్సరం నుంచి అమలుకు ప్రతిపాదనలు
- అదనంగా 58,200 సీట్లు.. ప్రాథమిక విద్యకు పెద్దపీట

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలోని మోడల్ పాఠశాలల రూపురేఖలు మారనున్నాయి. ప్రస్తుతం 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్య అందిస్తున్న 194 మోడల్ స్కూళ్లను తెలంగాణ పబ్లిక్ స్కూళ్లుగా (టీపీఎస్) మార్చేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఇందుకోసం రూ.787.54 కోట్లతో సమగ్ర ప్రణాళిక రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది. ప్రభుత్వ ఆమోదం లభిస్తే 2027-28 విద్యా సంవత్సరం నుంచి కొత్త విధానం అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. మోడల్ - మిగతా 3లో

సీఈసీపై ఇండీ కూటమి బహిరంగ అభిశంసన!

- జ్ఞానేశ్ కుమార్‌పై ఖర్గే తీవ్ర ఆరోపణలు
- ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్..
- 2023 నియామకాల చట్టాన్ని రద్దు చేయాలని తీర్మానం
- బ్యాలెట్ పేపర్లతోనే ఎన్నికలు నిర్వహించాలని పట్టుబాటు

దిల్లీలో మాక్ పార్లమెంట్



భారత వ్యతిరేక శక్తుల కుట్ర!

ఏక్తానగర్: దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నిస్తున్న భారత వ్యతిరేక శక్తుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. దేశంలో విభజనను ప్రోత్సహించేందుకు కొన్ని శక్తులు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. సామాజిక మాధ్యమాల వేదికగా అబద్ధాలు, వదంతులను వ్యాప్తి చేస్తూ ప్రజల్లో గందరగోళం సృష్టించి, దేశంలో అస్థిరతకు ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. దేశ ప్రజలంతా ఐక్యంగా ఉండాలని, జాతీయ సమైక్యతే భారతదేశానికి అతిపెద్ద బలమని స్పష్టం చేశారు.

ఐక్యతే దేశానికి రక్షణ కవచం!

ప్రపంచవ్యాప్తంగా రాజకీయ ఉద్రిక్తతలు, ఇంధన సంక్షోభం నెలకొన్నప్పటికీ భారత పౌరులపై వాటి ప్రభావం పడకుండా సమర్థంగా ఎదుర్కొన్నామని మోదీ పేర్కొన్నారు. ప్రపంచంలోని పలు దేశాల్లో పెట్రోల్, డీజిల్ కొనుగోళ్లపై ఆంక్షలు విధించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని గుర్తుచేశారు. భారీ జనాభా, పరిమిత స్వదేశీ పెట్రోలియం ఉత్పత్తి ఉన్న భారత్‌లోనూ తీవ్ర సంక్షోభం తలెత్తుతుందని గతంలో అంచనాలు వెలువడ్డాయని చెప్పారు. అయితే దేశ ప్రజల సహకారం, ప్రభుత్వ సమర్థవంతమైన చర్యలతో సంక్షోభాన్ని ఎదుర్కోగలిగామని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా అస్థిర పరిస్థితులు నెలకొన్న వేళ భారతీయుల ఐక్యతే దేశానికి



అతిపెద్ద రక్షణ కవచమని ఉద్ఘాటించారు.

పేదరికంపై గత పాలకులపై విమర్శలు

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దేశంలో పేదరిక నిర్మూలన గురించి చర్చలు జరుగుతూనే ఉన్నాయని ప్రధాని మోదీ అన్నారు. పేదరికాన్ని తొలగిస్తామని హామీలిచ్చి గతంలో పలువురు ఎన్నికల్లో ఓట్లు అడిగారని విమర్శించారు. పేదరిక నిర్మూలన నినాదాలు చేసినవారు వ్యక్తిగతంగా మరింత సంపన్నులయ్యారని వ్యాఖ్యానించారు. అయితే ప్రస్తుతం భారత్ అపూర్వమైన శక్తి, దృఢ సంకల్పంతో ముందుకు సాగుతోందని, ప్రజల్లో పెరుగుతున్న ఆత్మవిశ్వాసమే దేశ పురోగతికి ప్రధాన బలమని పేర్కొన్నారు.

ఉక్కుమనిషికి ఘన నివాళులు

ఉక్కుమనిషి, భారత మాజీ ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతి సందర్భంగా ప్రధాని మోదీ ఘనంగా నివాళులర్పించారు. గుజరాత్‌లోని ఏక్తానగర్‌లో ఉన్న స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వద్ద పటేల్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. దేశ సమగ్రత, ఐక్యత, జాతి నిర్మాణం కోసం పటేల్ చేసిన సేవలను కొనియాడారు. దృఢమైన, సంపన్నమైన, సమర్థవంతమైన భారతదేశ నిర్మాణానికి ఆయన తన జీవితాన్ని అంకితం చేశారని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న సాయుధ దళాల పరేడ్

పటేల్‌కు నివాళులర్పించిన అనంతరం ఏక్తానగర్‌లో సాయుధ దళాల పరేడ్ అట్టహాసంగా నిర్వహించారు. నర్మదా మాత విగ్రహం నుంచి రెప్లికా గార్డెన్ వరకు సాగిన ఈ కవాతులో సుమారు 10 వేల మంది పోలీసు, పారామిలటరీ సిబ్బంది పాల్గొన్నారు. వాయుసేన నిర్వహించిన ఫ్లైపాస్ట్, భద్రతా బలగాల మోటార్ సైకిల్ విన్యాసాలు, డాగ్ స్క్వాడ్ ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మార్షల్ ఆర్ట్స్, అశ్వ, ఒంటె దళాల కవాతు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 4,700 మంది కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భారతీయ సంస్కృతి, భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిచెప్పాయి.

సీఈసీపై ఇండీ కూటమి బహిరంగ అభిశంసన!

దిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ వ్యవహారశైలిపై కాంగ్రెస్ సహా ఇండీ కూటమి తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఆయనకు వ్యతిరేకంగా 'బహిరంగ ప్రజా అభిశంసన' తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. శనివారం దిల్లీలో రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే అధికారిక నివాసంలో లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్ అధ్యక్షతన మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం పనితీరు, ఎస్ఐఆర్ ప్రక్రియ, ఎన్నికల కమిషనర్ల నియామక చట్టంపై ప్రతిపక్ష నేతలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

మోదీ, అమిత్ షా ఆదేశాలతోనే పనిచేస్తున్నారు!

ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశాల మేరకే సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల సంఘాన్ని నడుపుతున్నారని ఖర్గే ఆరోపించారు. దీనివల్ల సామాన్యుల ఓటు హక్కు ప్రమాదంలో పడిందని విమర్శించారు. ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, రాజ్యాంగబద్ధ సంస్థ గౌరవాన్ని కాపాడాలన్నదే తమ ఉద్దేశమని స్పష్టం చేశారు. సీఈసీపై వ్యక్తిగత విద్వేషం లేదని, ఆయన పనితీరుపైనే తమ అభ్యంతరాలని పేర్కొన్నారు.

2023 చట్టాన్ని రద్దు చేయాలి

ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించి 2023లో తీసుకొచ్చిన చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని ఖర్గే డిమాండ్



చేశారు. ఆ చట్టం సీఈసీకి విస్తృతమైన రక్షణ కల్పిస్తోందని విమర్శించారు. రాష్ట్రపతికి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కూడా లేని స్థాయి రక్షణను సీఈసీకి కల్పించారని ఆరోపించారు. ఈ చట్టం ఆమోదం పొందిన సమయంలో 145 మంది ప్రతిపక్ష ఎంపీలను పార్లమెంటు నుంచి సస్పెండ్ చేశారని గుర్తుచేశారు.

14 కోట్ల ఓట్లు తొలగించారని ఆరోపణ

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ద్వారా దేశవ్యాప్తంగా సుమారు 14 కోట్ల మంది ఓటర్ల పేర్లను ఉద్దేశపూర్వకంగా తొలగించారని ఖర్గే ఆరోపించారు. అక్రమంగా తొలగించిన ఓట్లను తిరిగి పునరుద్ధరించాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత ఉండాలంటే భవిష్యత్తులో అన్ని ఎన్నికలను బ్యాలెట్ పేపర్ల ద్వారానే నిర్వహించాలని ఇండీ కూటమి కోరుతోందని తెలిపారు.

ఓటు హక్కును కాపాడాలి

18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించడం ద్వారా యువతకు దేశ భవిష్యత్తును నిర్ణయించే అవకాశం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ కల్పించారని ఖర్గే గుర్తుచేశారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఆ హక్కును బలహీనపరిచే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. తాము చొరబాటుదారుల కోసం ఓటు హక్కును కోరడం లేదని, భారత పౌరులందరి రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును పరిరక్షించాలన్నదే తమ డిమాండ్ అని స్పష్టం చేశారు.

ఇందిరా గాంధీకి నివాళులు

మాక్ పార్లమెంట్ సమావేశానికి ముందు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా ఖర్గే నివాళులర్పించారు. లోక్‌సభను తలపించేలా ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసి నిర్వహించిన ఈ సమావేశానికి వివిధ రాష్ట్రాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, ఇండీ కూటమి నేతలు, ప్రతిపక్ష ఎంపీలు హాజరయ్యారు.

దిల్లీ మార్చ్‌కు రాహుల్ పిలుపు!


దిల్లీ: దేశ రాజధానిలో రాజకీయ వేడి రాజుకుంటోంది. ఎన్నికల సంఘం పనితీరు, ఓటు హక్కుల పరిరక్షణ అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాన్ని ఉధృతం చేయాలని ఇండీ కూటమి నిర్ణయించింది. ఇందులో భాగంగా నవంబర్ 1న దిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించేందుకు సిద్ధమైంది. ఈ ర్యాలీలో రాజకీయ పార్టీలు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. అయితే మార్చ్‌కు అనుమతి లేదని దిల్లీ పోలీసులు ప్రకటించడంతో రాజకీయంగా ఉత్కంఠ నెలకొంది.

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే పోరాటం

ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఎన్నికల సంఘం కలిసి భారత ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ పరిణామాలకు నిరసనగా ప్రజలంతా ఉద్యమంలో భాగస్వాములు కావాలని తన ఎక్స్ ఖాతా ద్వారా పిలుపునిచ్చారు. నవంబర్ 1న మధ్యాహ్నం 12 గంటలకు కన్నాట్ ప్లేస్--మింటో రోడ్ జంక్షన్ నుంచి మార్చ్ ప్రారంభమై రామ్‌లీలా మైదానం వరకు కొనసాగుతుందని వెల్లడించారు. ర్యాలీలో పాల్గొనేందుకు ప్రజలు దిల్లీకి రాకుండా అడ్డుకునేందుకు అమిత్ షా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

మార్చ్‌కు అనుమతి లేదన్న పోలీసులు

రాహుల్ గాంధీ ప్రకటనపై స్పందించిన దిల్లీ పోలీసులు.. కన్నాట్ ప్లేస్ నుంచి మార్చ్ నిర్వహించేందుకు తమకు ఎలాంటి దరఖాస్తు అందలేదని స్పష్టం చేశారు. అయితే



ఎంపీలు, రాజకీయ నాయకులు తమ వ్యక్తిగత వాహనాల్లో కాన్‌స్టిట్యూషన్ క్లబ్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసానికి వెళ్లేందుకు అభ్యంతరం లేదని తెలిపారు. గతంలో నిరసనలకు వేదికగా ఉన్న జంతర్ మంతర్‌లో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించరాదని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

దిల్లీలో భారీ భద్రత.. ట్రాఫిక్ మళ్లింపులు

ఇండీ కూటమి ర్యాలీ నేపథ్యంలో దిల్లీ పోలీసులు అప్రమత్తమయ్యారు. రామ్‌లీలా మైదానం పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేస్తున్నారు. సెంట్రల్ దిల్లీ పోలీసు విభాగాలతో పాటు అదనపు పారామిలటరీ బలగాలను మోహరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పలు కీలక మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయనున్నారు. నేతాజీ సుభాష్ మార్గ్, రాజ్‌ఘాట్, దిల్లీ గేట్, ఐటీఓ, అజ్మేరీ గేట్, రంజీత్ సింగ్ ఫ్లైఓవర్, ఝండేవలన్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టనున్నారు. రైలు ప్రయాణికులు ముందస్తుగా తమ ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని పోలీసులు సూచించారు.

ఎన్ని అడ్డంకులొచ్చినా ర్యాలీ నిర్వహిస్తాం

ఇండీ కూటమి ర్యాలీకి దేశవ్యాప్తంగా ప్రజలు తరలివస్తున్నారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ర్యాలీ నిర్వహించి తీరుతామని స్పష్టం చేశారు. దేశం నలుమూలల నుంచి ప్రజలు దిల్లీకి బయలుదేరారని, ఇప్పటివరకు దిల్లీ చూసిన అతిపెద్ద ర్యాలీల్లో ఇది ఒకటిగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

అభిశంసన నోటీసు తిరస్కరణపై ఆగ్రహం

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసన తీర్మానానికి సంబంధించిన నోటీసును తిరస్కరించడంపై వేణుగోపాల్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వంద మందికి పైగా పార్లమెంటు సభ్యులు సంతకాలు చేసిన నోటీసును కనీసం పరిశీలనకు స్వీకరించాల్సిందని అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన ప్రకటనపైనా స్పందిస్తూ, ప్రతిపక్షాల డిమాండ్లను ఎందుకు ముందుకు తీసుకెళ్లడం లేదని ప్రశ్నించారు.

ఖైబర్ పఖ్తుంఖ్వాపై పాక్ సైన్యం కన్ను.. ఖనిజ సంపదే లక్ష్యమా?

పాకిస్థాన్ సైన్యం అనుసరిస్తున్న కఠిన వైఖరి, ముఖ్యంగా ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో జరుగుతున్న పరిణామాలు తీవ్ర ఆందోళనలకు దారితీస్తున్నాయి. బలప్రయోగంతోనే తిరుగుబాట్లను అణచివేయవచ్చనే ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ 'హార్డ్-స్టేట్' సిద్ధాంతం ఇప్పుడు ఈ ప్రావిన్స్‌లో పరీక్షకు నిలిచింది. అయితే, ఈ చర్యల వెనుక అసలు లక్ష్యం ప్రావిన్స్‌లోని అపారమైన ఖనిజ సంపదను చేజిక్కించుకోవడమేనని అంతర్జాతీయ నివేదికలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. 'గ్రీక్ సిటీ టైమ్స్' ప్రచురించిన ఒక కథనం ప్రకారం.. ఖైబర్ పఖ్తుంఖ్వాలో ఎన్నికైన ప్రభుత్వాన్ని అకస్మాత్తుగా రద్దు చేసి, ఎమర్జెన్సీ విధించడం వెనుక పెద్ద వ్యూహం ఉందని తెలుస్తోంది. అక్టోబర్ 11న రాజ్యాంగంలోని ఆర్టికల్ 232, 234 కింద అత్యవసర అధికారాలను ఉపయోగించి ఫెడరల్ ప్రభుత్వం ప్రావిన్స్‌లో గవర్నర్ పాలన విధించింది. ముఖ్యమంత్రి సోహైల్ అఫ్రిదిని కస్టడీలోకి తీసుకుంది.



పాకిస్థాన్ 18వ రాజ్యాంగ సవరణ ప్రకారం ఖనిజాలు ప్రావిన్సుల ఆధీనంలో ఉంటాయి. తాజా చర్యలతో ప్రావిన్షియల్ అసెంబ్లీ రద్దవడంతో, ఖనిజాలపై ఫెడరల్ ప్రభుత్వానికి పూర్తి నియంత్రణ లభించినట్లయింది. దాదాపు 4 కోట్ల జనాభా, బలమైన రాజకీయ వ్యవస్థ, ఇప్పటికే కొనసాగుతున్న సాయుధ తిరుగుబాటు, పొరుగునే శత్రుదేశంగా భావించే ఆఫ్ఘనిస్థాన్‌తో సరిహద్దు వంటి క్లిష్టమైన పరిస్థితులున్న ఖైబర్ పఖ్తుంఖ్వాలో సైనిక వ్యూహం బెడిసికొట్టే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భద్రతా వైఫల్యాల కారణంగానే ఎమర్జెన్సీ విధించామని ఇస్లామాబాద్ చెబుతున్నప్పటికీ, వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. 2026 ప్రథమార్ధంలోనే 122 మంది పోలీసులు మరణించగా, హింసాత్మక ఘటనలు గణనీయంగా పెరిగాయి. ఎన్నికైన ప్రభుత్వాన్ని కూల్చివేయడం, ముఖ్యమంత్రిని అరెస్ట్ చేయడం, ప్రావిన్స్ వనరులను కేంద్రం, విదేశీ కొనుగోలుదారులకు అప్పగించే ప్రయత్నం చేయడం వంటి చర్యలు తీవ్రవాద గ్రూపులకు కొత్త ఆయుధాన్ని అందించినట్లే అవుతుందని ఆ నివేదిక హెచ్చరించింది. ఇది ఖైబర్ పఖ్తుంఖ్వాను కూడా బలూచిస్థాన్ లాగా పాలనారహిత ప్రాంతంగా మార్చే ప్రమాదం ఉందని, ఖనిజాల ద్వారా వచ్చే ఆదాయం కంటే భద్రతాపరమైన నష్టమే ఎక్కువగా ఉంటుందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బంగాళాఖాతంలో కొత్త వాయుగుండం

బంగాళాఖాతంలో మరో తుపాను రూపుదిద్దుకుంటోంది. అర్నబ్ తుపాను తీరం దాటిన కొద్ది రోజులకే, ఆగ్నేయ బంగాళాఖాతంలో మేఘాలు దట్టంగా ఏర్పడి ఒక వ్యవస్థగా మారుతున్న దృశ్యాలను ఇస్రోకు చెందిన ఇన్ శాట్-3డీఎస్ శాటిలైట్ శనివారం ఉదయం గుర్తించింది. ఈ వ్యవస్థ ఆంధ్రప్రదేశ్ తీరం వైపు కదులుతుండటంతో అధికారులు దీనిని నిశితంగా గమనిస్తున్నారు. అక్టోబర్ 29న దక్షిణ అండమాన్ సముద్రం, దాని పరిసర ప్రాంతాల్లో అల్పపీడనంగా మొదలైన ఈ వ్యవస్థ, పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతోంది. అక్టోబర్ 31 సాయంత్రం నాటికి ఇది వాయుగుండంగా బలపడింది. రానున్న రెండు రోజుల్లో ఆంధ్రప్రదేశ్ తీరం వైపు కదిలే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేస్తోంది. తాజా శాటిలైట్ చిత్రాల్లో ఒక సుడిలాగా వాయుగుండం స్పష్టంగా కనిపిస్తోంది. దీని ప్రభావంతో దక్షిణ అండమాన్ సముద్రం, నికోబార్ దీవుల్లో, ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడవచ్చని, ఆ సమయంలో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. అయితే, ప్రస్తుతానికి పోర్టులకు ఎలాంటి హెచ్చరికలు జారీ చేయలేదు.

అఖండ భారత రూపశిల్పికి ఘన నివాళి!

ఏక్తానగర్/దిల్లీ: అఖండ భారత నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన ఉక్కుమనిషి, మాజీ ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా ఘన నివాళులు అర్పించారు. ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్‌లోని ఏక్తానగర్‌లో ఉన్న స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వద్ద పటేల్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. దేశ సమగ్రత, ఐక్యత, జాతి నిర్మాణం కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా పలువురు ప్రముఖులు కూడా పటేల్‌కు నివాళులర్పించారు.

దేశ నిర్మాణానికి జీవితాన్ని అంకితం చేశారు: మోదీ

సర్దార్ వల్లభాయ్ పటేల్ బలమైన భారతదేశ నిర్మాణానికి తన జీవితాన్ని అంకితం చేశారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. దేశ సేవలో ఆయన చేసిన త్యాగం, చూపిన అంకితభావం ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణానికి స్ఫూర్తిగా నిలుస్తాయని ఎక్స్ వేదికగా వెల్లడించారు. అఖండ భారత నిర్మాత, జాతి ఉక్కుమనిషికి హృదయపూర్వక వందనాలు సమర్పిస్తున్నట్లు తెలిపారు.

ఆధునిక భారత రూపశిల్పి: రాష్ట్రపతి ముర్ము

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్రపతి భవన్‌లోని గణతంత్ర మండపంలో పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఆధునిక భారతదేశ ప్రధాన రూపశిల్పిగా ఆయన అందించిన సేవలను కొనియాడారు. దేశంలోని సంస్థానాల ఏకీకరణతో పాటు పటిష్టమైన పరిపాలనా వ్యవస్థ ఏర్పాటులో పటేల్ చారిత్రాత్మక పాత్ర పోషించారని పేర్కొన్నారు. దేశ ఐక్యత, సమగ్రతకు ఆయన చేసిన సేవలకు గుర్తుగా ప్రతి ఏటా అక్టోబర్ 31న జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. పటేల్ జీవితం, ఆదర్శాల నుంచి ప్రతి ఒక్కరూ స్ఫూర్తి పొందాలని పిలుపునిచ్చారు.

దేశాన్ని ఏకం చేసిన మహానేత: అమిత్ షా

సంస్థానాలుగా విడిపోయిన దేశాన్ని తన దూరదృష్టితో ఏకం చేసి బలమైన భారతదేశానికి పటేల్ పునాది వేశారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా కొనియాడారు. అఖిల భారత సర్వీసుల ఏర్పాటుతో దేశ పరిపాలనా వ్యవస్థకు పటిష్టమైన పునాది వేశారని గుర్తుచేశారు. ఖేడా, బర్డోలీ సత్యాగ్రహాల ద్వారా రైతుల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం ప్రజాసేవకు గొప్ప ఉదాహరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. దేశ ప్రయోజనాలకే అత్యున్నత ప్రాధాన్యం ఇచ్చిన పటేల్ త్యాగం, దేశభక్తి ప్రతి పౌరుడికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఏక్ భారత్ - శ్రేష్ఠ భారత్ నిర్మాణంలో ఆయన ఆశయాలు మార్గదర్శకంగా నిలుస్తాయని ఎక్స్ వేదికగా సందేశమిచ్చారు.

దిల్లీలో ప్రముఖుల పుష్పాంజలి

పటేల్ జయంతి సందర్భంగా దిల్లీలోని సర్దార్ పటేల్ చౌక్‌లో ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తరణ్‌జిత్ సింగ్ సంధు, ముఖ్యమంత్రి రేఖా గుప్తా, బీజేపీ ఎంపీ బాన్సురి స్వరాజ్ తదితరులు పుష్పాంజలి ఘటించారు. దేశ సమైక్యత కోసం పటేల్ చేసిన కృషిని స్మరించుకున్నారు. ఆయన జయంతిని జాతీయ ఐక్యతా దినోత్సవంగా నిర్వహిస్తూ దేశ ప్రజల్లో సమైక్యతా భావాన్ని చాటిచెబుతున్నారు.

ఇంధన సరఫరాలో ఆంక్షలు.. అడ్డంకులు వద్దు!

అట్లాంటా: ప్రపంచ ఇంధన సరఫరాలో ఆంక్షలు, రవాణా మార్గాల్లో అడ్డంకులు సృష్టించడంపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. చమురు, సహజ వాయువు సరఫరాలో అంతరాయాలు కలిగించడం, ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులు చేయడం వల్ల అంతర్జాతీయ మార్కెట్లలో అస్థిరత పెరుగుతోందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇంధన వాణిజ్యాన్ని తమకు అనుకూలంగా మలుచుకునేందుకు కొన్ని దేశాలు వ్యూహాత్మక చర్యలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. అమెరికాలోని అట్లాంటాలో జరిగిన జీ20 విదేశాంగ మంత్రుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

సరఫరాలో అనిశ్చితి.. ధరల్లో అస్థిరత

ప్రపంచం ప్రస్తుతం ఇంధన ఉత్పత్తి కొరత కంటే సరఫరాలో అనిశ్చితి, అంతరాయాలు, ధరల పెరుగుదల వంటి సమస్యలను ఎదుర్కొంటోందని జైశంకర్ పేర్కొన్నారు. ఆంక్షలు, కీలక రవాణా మార్గాల్లో అడ్డంకుల కారణంగా ఇంధన మార్కెట్లలో తరచూ ఒడిదుడుకులు ఏర్పడుతున్నాయని తెలిపారు. వీటి ప్రభావం ముఖ్యంగా తక్కువ ఆదాయ దేశాలపై అధికంగా పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంధన మార్కెట్లు అందరికీ అందుబాటులో ఉండేలా, సరఫరాలో స్థిరత్వం ఉండేలా జీ20 దేశాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

ఎల్‌పీజీ సరఫరా అత్యంత కీలకం

భారత్‌కు వంట ఇంధనంగా ఉపయోగించే ఎల్‌పీజీ నిరంతరాయంగా, నమ్మకంగా అందుబాటులో ఉండటం అత్యవసరమని జైశంకర్ స్పష్టం చేశారు. కొన్ని దేశాలు చమురు, సహజ వాయువు సరఫరాకు సంబంధించి తమకు అనుకూలంగా మినహాయింపులు ప్రకటించడం అంతర్జాతీయంగా ప్రశ్నలు లేవనెత్తుతోందన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఒక దేశం తీసుకునే నిర్ణయాలు ఇతర దేశాలపై చూపే ప్రభావాన్ని తక్కువగా అంచనా వేయరాదని సూచించారు.

సైనిక పరిష్కారాలు పనిచేయవు

అంతర్జాతీయ సమస్యలకు సైనిక చర్యలు శాశ్వత పరిష్కారం చూపలేవని, దౌత్యపరమైన చర్చల ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవాలని జైశంకర్ పిలుపునిచ్చారు. సముద్రయాన సిబ్బందిపై దాడులను తీవ్రంగా ఖండించారు. అంతర్జాతీయ సముద్ర చట్టాలకు అనుగుణంగా నౌకాయాన స్వేచ్ఛను పరిరక్షించాలని, నౌకలు, నావికులపై దాడులను నిలిపివేయాలని కోరారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంఘర్షణల కారణంగా ఇంధనం, ఆహారం, ఎరువుల సరఫరా వ్యవస్థలపై ఒత్తిడి పెరుగుతోందని చెప్పారు. ముఖ్యంగా గ్లోబల్ సౌత్ దేశాలు ఈ పరిణామాల భారాన్ని అధికంగా మోస్తున్నాయని పేర్కొన్నారు.

ప్రత్యామ్నాయ సరఫరా వ్యవస్థలు అవసరం

మార్కెట్లలోకి ఉత్పత్తులను అధికంగా మళ్లించడం, సరఫరా గొలుసులను ఆయుధాలుగా ఉపయోగించడం, ఇతర దేశాలకు మార్కెట్ ప్రవేశాన్ని అడ్డుకోవడం వంటి చర్యలు పారిశ్రామిక అభివృద్ధికి ఆటంకంగా మారుతున్నాయని జైశంకర్ విమర్శించారు. ప్రత్యామ్నాయ రవాణా మార్గాలు, పటిష్టమైన సరఫరా వ్యవస్థలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కీలక ఖనిజాల అన్వేషణ నుంచి రీసైక్లింగ్ వరకు భారత్ ప్రత్యేక జాతీయ మిషన్‌ను అమలు చేస్తోందని వివరించారు. ఇంధన నిల్వలు, స్మాల్ మాడ్యులర్ రియాక్టర్లు, గ్రీన్ హైడ్రోజన్, జీవ ఇంధనాల అభివృద్ధికి అంతర్జాతీయ పెట్టుబడులు, ఆర్థిక సహకారం పెరగాలని సూచించారు. ఉగ్రవాద ముప్పును కూడా వ్యూహాత్మక కారణాలతో విస్మరించరాదని హెచ్చరించారు.

పలు దేశాల మంత్రులతో ద్వైపాక్షిక చర్చలు

జీ20 సమావేశం సందర్భంగా జైశంకర్ కెనడా విదేశాంగ మంత్రి అనితా ఆనంద్‌తో భేటీ అయ్యారు. ఇరు దేశాల మధ్య సహకారాన్ని మరింత విస్తరించడంపై చర్చించారు. అర్జెంటీనా విదేశాంగ మంత్రి పాబ్లో క్విర్నోతో వాణిజ్యం, కీలక ఖనిజాలు, రక్షణ, అణు సహకారంపై మాట్లాడారు. మెక్సికో విదేశాంగ మంత్రి రాబర్టో వెలాస్కో అల్వారెజ్, బ్రెజిల్ విదేశాంగ మంత్రి మౌరో వియెరా, జర్మనీ విదేశాంగ మంత్రి జోహాన్ వాడెఫుల్‌తోనూ సమావేశమై ద్వైపాక్షిక సంబంధాలు, అంతర్జాతీయ పరిణామాలపై చర్చలు జరిపారు.

హోటళ్లలో అపరిశుభ్రత బట్టబయలు!

కిచెన్లలో బొద్దింకలు, ఎలుకల వ్యర్థాలు..
14 హోటళ్ల లైసెన్సులు సస్పెండ్
22 ఆహార సంస్థల్లో తనిఖీలు
544 కిలోల కలుషిత ఆహారం ధ్వంసం
21 ఆహార నమూనాల సేకరణ
మరో 13 కిలోల వాడిన నూనె పారబోత



హైదరాబాద్: నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార భద్రతా ప్రమాణాల ఉల్లంఘనలు వెలుగుచూశాయి. గోల్కొండ, చార్మినార్ జోన్ల పరిధిలో అక్టోబర్ 31న ఎ+ ఖూఖీజు అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఎన్ఫోర్స్మెంట్ విభాగానికి చెందిన 22 ప్రత్యేక బృందాలు, ఫుడ్ సేఫ్టీ అధికారులు, పోలీసుల సహకారంతో మొత్తం 22 ఆహార సంస్థలను తనిఖీ చేశాయి. ఈ సందర్భంగా పలు హోటళ్ల వంటగదుల్లో తీవ్ర అపరిశుభ్ర పరిస్థితులను గుర్తించారు.

కిచెన్లలో పురుగులు.. కుళ్లిన ఆహారం

తనిఖీల్లో కొన్ని హోటళ్ల వంటగదుల్లో బొద్దింకలు, ఈగలు సంచరిస్తుండగా, మరికొన్ని చోట్ల ఎలుకల వ్యర్థాలు కనిపించాయి. కుళ్లిపోయిన కూరగాయలు, ఫంగస్ పట్టిన ఆహార పదార్థాలు, గడువు ముగిసిన వస్తువులను అధికారులు గుర్తించారు. వెజ్, నాన్‌వెజ్ పదార్థాలను ఒకే ఫ్రిజ్‌లో నిల్వ చేయడం, వండిన ఆహారాన్ని సరైన లేబుల్స్ లేకుండా భద్రపరచడం వంటి ఉల్లంఘనలు బయటపడ్డాయి.

వంట నూనె పదేపదే వినియోగం

కొన్ని హోటళ్లలో వంట నూనెను పదేపదే ఉపయోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. వంటగదుల్లో మురికినీరు నిల్వ ఉండటం, అపరిశుభ్రమైన ఫ్రిజ్‌లు, తుప్పుపట్టిన పాత్రలు, మురికిగా ఉన్న చిమ్నీలు, ఎగ్జాస్ట్‌లు కనిపించాయి. ఆహార తయారీలో పాల్గొనే సిబ్బంది హెయిర్ నెట్స్, గ్లౌజులు, అప్రాన్లు ధరించకుండా విధులు నిర్వహిస్తున్నట్లు తనిఖీల్లో వెల్లడైంది.

544 కిలోల ఆహారం ధ్వంసం

అనుమానాస్పద కల్తీపై అధికారులు 21 ఆహార నమూనాలను సేకరించారు. కుళ్లిన కూరగాయలు, కలుషిత ఆహార పదార్థాలు, గడువు ముగిసిన వస్తువులు, పురుగులు పట్టిన పదార్థాలు కలిపి మొత్తం 544 కిలోల ఆహారాన్ని అక్కడికక్కడే ధ్వంసం చేశారు. పదేపదే వినియోగిస్తున్నారనే అనుమానంతో మరో 13 కిలోల వాడిన వంట నూనెను పారబోశారు.

ప్రముఖ హోటళ్లకు షోకాజ్ నోటీసులు

తీవ్రమైన ఉల్లంఘనలు గుర్తించిన తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్, హోటల్ సబ్జీ, పిస్తా హౌస్, స్వీకార్ హోటల్, మండీ ఏ 36 అరేబియన్ కిచెన్, గోల్కొండ హోటల్ అండ్ రిసార్ట్స్, ఇంపీరియల్ మల్టీకుజిన్ రెస్టారెంట్, తైబా బేకరీలకు అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

14 హోటళ్ల లైసెన్సులు సస్పెండ్

తీవ్ర అపరిశుభ్రత, ఆహార భద్రతా నిబంధనల ఉల్లంఘనల నేపథ్యంలో 14 హోటళ్లు, రెస్టారెంట్ల ఖీూూ× లైసెన్సులను అధికారులు సస్పెండ్ చేశారు. తక్షణమే వ్యాపార కార్యకలాపాలు నిలిపివేయాలని ఆదేశించారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలపై జరిమానాలతో పాటు తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

వేలం ద్వారా నిధుల సమీకరణకు సీఎం యోచన

-మొదటిపేజీ తరువాయి

కోరినవారు సరైన యాజమాన్య ఆధారాలు చూపలేకపోయారని ధర్మాసనం పేర్కొంది. రెవెన్యూ రికార్డుల్లోని కొన్ని నమోదులు కూడా చెల్లుబాటు కావని స్పష్టం చేసింది. దీంతో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న వివాదంలో తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వెలువడింది.

వేలం ద్వారా నిధుల సమీకరణకు సీఎం యోచన

సుప్రీంకోర్టు తీర్పుపై స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. మియాపూర్ భూముల ద్వారా ప్రభుత్వానికి వనరులు సమకూర్చుకునే అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు. భూములను వేలం వేసి వచ్చే ఆదాయాన్ని సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్యం, పేదలు, గిరిజనులు, దళితుల సంక్షేమానికి వినియోగించాలనే ఆలోచనను వెల్లడించారు. దీనిపై క్యాబినెట్ సబ్‌కమిటీ పరిశీలించి, అనంతరం ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇంకా వేలం ప్రక్రియ పూర్తికాలేదు.

రేవంత్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ అభ్యంతరం

మరోవైపు మియాపూర్ భూములను వేలం వేయాలన్న ప్రభుత్వ ఆలోచనను బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తప్పుబట్టారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఈ భూములను కాపాడేందుకు న్యాయపోరాటం చేసిందని ఆయన పేర్కొన్నారు. ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా వచ్చిన వెంటనే వేలం ప్రతిపాదన తీసుకురావడం సరైంది కాదని విమర్శించారు. విలువైన ప్రభుత్వ భూములను అమ్మడం వల్ల భవిష్యత్ తరాలకు వాటి సామాజిక ప్రయోజనాలు దూరమవుతాయని ఆరోపించారు. భూములను ప్రజా అవసరాలకు వినియోగించాలని డిమాండ్ చేశారు.

400 ఎకరాలు ఖాళీ.. 150 ఎకరాల్లో నివాసాలు

సుప్రీంకోర్టు తీర్పు అనంతరం రంగారెడ్డి జిల్లా అధికారులు



భూముల పరిస్థితిపై సంయుక్త సర్వే నిర్వహించారు. ప్రాథమిక అంచనా ప్రకారం మొత్తం 550 ఎకరాల్లో సుమారు 400 ఎకరాలు ఖాళీగా ఉండగా, మరో 150 ఎకరాల్లో కాలనీలు, నివాస నిర్మాణాలు, ఇతర కట్టడాలు ఉన్నట్లు గుర్తించారు. ఖాళీగా ఉన్న భూమిని రక్షించేందుకు రెవెన్యూ, హెచ్ఎండీఏ అధికారులు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ఉన్న నివాస నిర్మాణాలపై తక్షణ చర్యలు తీసుకోబోమని జిల్లా కలెక్టర్ వెల్లడించినట్లు సమాచారం.

ప్రజా ప్రయోజనాలకా.. ఆదాయ సమీకరణకా?

మియాపూర్ భూముల వ్యవహారంలో ఇప్పుడు ప్రధానంగా చర్చకు వస్తున్న అంశం వాటి వినియోగమే. వేలం ద్వారా ఆదాయం సమకూర్చుకుని అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేయాలన్నది ప్రభుత్వ ఆలోచనగా కనిపిస్తోంది. మరోవైపు భూములను ప్రభుత్వ అవసరాలకు, సామాజిక సంక్షేమ కార్యక్రమాలకు నేరుగా వినియోగించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే నివాసాలు ఏర్పడిన 150 ఎకరాల విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది కూడా కీలకంగా మారింది. రాజకీయ విమర్శలకు మించి ప్రజలకు ప్రయోజనం దక్కేలా నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. వేలం ప్రతిపాదనపై క్యాబినెట్ ఏం నిర్ణయిస్తుంది? భూముల వినియోగానికి ఎలాంటి ప్రణాళిక రూపొందిస్తుంది? నివాసాలు ఉన్న ప్రాంతాల సమస్యను ఎలా పరిష్కరిస్తుంది? అన్న ప్రశ్నలకు రానున్న రోజుల్లో సమాధానం లభించనుంది.

మోడల్ స్కూళ్లకు పబ్లిక్ స్కూళ్ల హోదా!

-మొదటిపేజీ తరువాయి


స్కూళ్లలో ఇకపై 1 నుంచి 5వ తరగతి వరకు కూడా విద్య అందించాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఇందుకోసం ప్రతి పాఠశాలలో ఒక్కో తరగతికి రెండు సెక్షన్ల చొప్పున అదనపు తరగతి గదులు నిర్మించాల్సి ఉంటుంది. ఒక్కో పాఠశాలకు సుమారు రూ.3 కోట్ల చొప్పున మొత్తం 194 పాఠశాలలకు రూ.582 కోట్లు ఖర్చవుతాయని అంచనా వేసింది. ఈ నిధులను ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) రుణంలో కొంత భాగం నుంచి వినియోగించాలని ప్రతిపాదించింది.

105 పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధి

రాష్ట్రంలోని 105 మోడల్ స్కూళ్లలో భవన నిర్మాణాలు అసంపూర్తిగా ఉండటంతోపాటు మరమ్మతులు అవసరమని విద్యాశాఖ గుర్తించింది. వీటిలో 38 పాఠశాలల్లో నిర్మాణాలు పాక్షికంగా పూర్తికాగా, మరో 67 చోట్ల పనులు ప్రారంభించాల్సి ఉంది. అదనంగా ప్రహరీ గోడలు, పాఠశాల ప్రాంగణాల అభివృద్ధి, క్రీడా మైదానాలు, బాస్కెట్‌బాల్ కోర్టుల ఏర్పాటు వంటి పనులకు రూ.205.54 కోట్లు అవసరమని అంచనా వేసింది.

70 శాతం ఏఐఐబీ రుణం.. 30 శాతం రాష్ట్ర వాటా

మొత్తం రూ.787.54 కోట్ల ప్రణాళికలో 70 శాతం నిధులను ఏఐఐబీ రుణం ద్వారా, మిగిలిన 30 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాలని ప్రతిపాదించారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులు సమకూరితే వాటిని ప్రభుత్వ వాటా కింద వినియోగించే ఆలోచనలో ఉన్నారు. ఇందుకోసం పాఠశాల విద్యాశాఖ ఇప్పటికే పబ్లిక్ ట్రస్టును ఏర్పాటు చేసింది.



కొత్తగా 58,200 సీట్ల కల్పన

ప్రస్తుతం 194 మోడల్ స్కూళ్లలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు మొత్తం 1.59 లక్షల సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో సుమారు 1.10 లక్షల సీట్లు భర్తీ అయ్యాయి. ప్రాథమిక తరగతులను ప్రారంభించడం ద్వారా ఒక్కో పాఠశాలలో అదనంగా 300 సీట్లు అందుబాటులోకి రానున్నాయి. రెండు సెక్షన్లలో ఒక్కో తరగతికి 60 మంది చొప్పున విద్యార్థులకు ప్రవేశం కల్పించనున్నారు. దీంతో 194 పాఠశాలల్లో కలిపి అదనంగా 58,200 సీట్లు అందుబాటులోకి వస్తాయి.

ఆంగ్ల మాధ్యమ విద్యకు మరింత ప్రాధాన్యం

మోడల్ స్కూళ్లలో ఇప్పటికే పూర్తిస్థాయిలో ఆంగ్ల మాధ్యమంలో బోధన కొనసాగుతోంది. అయితే రవాణా సౌకర్యాలు లేకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో విద్యార్థుల నమోదు ఆశించిన స్థాయిలో ఉండటం లేదని అధికారులు భావిస్తున్నారు. పబ్లిక్ స్కూళ్లుగా మార్పు చేయడంతోపాటు రవాణా సౌకర్యాలు కల్పిస్తే విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వ ఆమోదం, నిధుల కేటాయింపు అనంతరం ఈ ప్రణాళిక కార్యరూపం దాల్చనుంది.

పేదరికం తగ్గింపులో భారత్ పురోగతి!



-మొదటిపేజీ తరువాయి

లెక్కించిన తీవ్ర పేదరికం సైతం 27.1 శాతం నుంచి 2.6 శాతానికి పడిపోయిందని వివరించారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

పేదరికాన్ని తగ్గించడం అంటే కేవలం నినాదాలు ఇవ్వడం కాదని, ప్రజల జీవితాల్లో ప్రత్యక్ష మార్పులు తీసుకురావడమేనని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. దేశంలో 99.9 శాతం ఇళ్లకు విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి వచ్చిందని, 2019 నాటికే గ్రామీణ పారిశుద్ధ్య కవరేజ్ 100 శాతానికి చేరిందని తెలిపారు. ఉజ్వల పథకం ద్వారా ఎల్పీజీ కనెక్షన్లు, జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నల్లా నీటి సౌకర్యం విస్తరించాయని వివరించారు. జాతీయ ఆహార భద్రతా చట్టం కింద కోట్లాది మందికి రక్షణ కల్పించడంతో పాటు, సుమారు 80 కోట్ల మందికి ఉచిత రేషన్ అందిస్తున్నట్లు చెప్పారు.

ఉపాధి, ఆరోగ్య రంగాల్లో చర్యలు

2017 నుంచి 2023 మధ్య దేశంలో 13.4 కోట్ల కొత్త ఉద్యోగాలు సృష్టించినట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఉపాధి అవకాశాలు పెరిగాయని, అనేక కుటుంబాలకు అదనపు ఆదాయం సమకూరుతోందని పేర్కొన్నారు. కేన్సర్ చికిత్సకు ఉపయోగించే 487 ఔషధ బ్రాండ్ల ధరలను నవంబర్ 9 నుంచి తగ్గించినట్లు వెల్లడించారు. వాటిలో 276 రకాల మందుల ధరలు 50 నుంచి 90 శాతం వరకు తగ్గాయని, తద్వారా బాధితులకు ఏటా సుమారు రూ.2,500 కోట్ల మేర ఆదా అవుతుందని వివరించారు.

దళారుల ప్రమేయం లేకుండా పథకాల అమలు

స్వచ్ఛ భారత్, సౌభాగ్య, ఉజ్వల, జల్ జీవన్ మిషన్ వంటి పథకాలను లక్ష్యాధారితంగా అమలు చేయడం వల్లే సంక్షేమ ఫలాలు నేరుగా లబ్ధిదారులకు చేరుతున్నాయని కిషన్‌రెడ్డి అన్నారు. మధ్యవర్తుల ప్రమేయం, నిధుల లీకేజీలను తగ్గించేలా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను కొనసాగిస్తోందని తెలిపారు.

గత పాలనతో పోల్చిన కిషన్‌రెడ్డి

కాంగ్రెస్ పాలనతో పోలిస్తే ప్రస్తుతం గ్రామీణ పారిశుద్ధ్యం, గ్యాస్ కనెక్షన్ల విస్తరణలో గణనీయమైన మార్పు వచ్చిందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. 2014లో గ్రామీణ పారిశుద్ధ్య కవరేజ్ 38.7 శాతం, గ్యాస్ కనెక్షన్ల శాతం 55.9గా మాత్రమే ఉన్నాయని గుర్తుచేశారు. గతంలో 'గరీబీ హఠావో' వంటి నినాదాలకే పరిమితమయ్యారని కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు.

పేదల కష్టాలు తెలిసిన నాయకత్వం

ప్రధాని మోదీ పేదరికాన్ని స్వయంగా అనుభవించిన నాయకుడని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పేద కుటుంబాలు ఎదుర్కొనే వంటగ్యాస్, తాగునీరు, వైద్య ఖర్చుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. పేదల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకురావడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని, 140 కోట్ల మంది ప్రజల భాగస్వామ్యంతో వికసిత్ భారత్ నిర్మాణానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.

అన్నదాతకు నవంబర్ వానలే ఆశ!



-మొదటిపేజీ తరువాయి

లభ్యతపై సందిగ్ధత నెలకొంది. ఈ నేపథ్యంలో నవంబర్‌లో కురిసే వర్షాలపైనే అన్నదాతలు ఆశలు పెట్టుకున్నారు.

రెండు రాష్ట్రాల్లోనూ వర్షపాతం లోటు

అక్టోబర్ 30 నాటికి అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం తెలంగాణలో జూన్ 1 నుంచి అక్టోబర్ 30 వరకు సాధారణంగా 829.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 623.1 మిల్లీమీటర్లు మాత్రమే కురిసింది. దీంతో 206.8 మిల్లీమీటర్ల లోటు నమోదైంది. సాధారణ వర్షపాతంతో పోలిస్తే ఇది 25 శాతం తక్కువ. ఆంధ్రప్రదేశ్‌లోనూ పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. సాధారణంగా 743.2 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా, 516.7 మిల్లీమీటర్లకే పరిమితమైంది. అంటే 226.5 మిల్లీమీటర్ల లోటు నమోదైంది. సాధారణ వర్షపాతంతో పోలిస్తే 30.5 శాతం తక్కువ వర్షం కురిసింది.

జిల్లాలవారీగా భిన్న పరిస్థితులు

రాష్ట్ర సగటు వర్షపాతం మాత్రమే అన్ని ప్రాంతాల పరిస్థితిని ప్రతిబింబించదు. కొన్ని జిల్లాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షం కురిసినా, మరికొన్ని జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఫలితంగా సాగునీటి వనరులపై ఆధారపడి పంటలు సాగు చేసిన రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వాలు ఇప్పటికే ఏపీలో 388 మండలాలు, తెలంగాణలో 365 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించినట్లు కథనంలో పేర్కొన్నారు.

నవంబర్ వర్షాలపై రైతుల ఆశలు

ప్రస్తుతం పొలాల్లో ఉన్న పంటలను కాపాడుకోవడానికి రైతులకు తక్షణం వర్షాలు అవసరం. నవంబర్‌లో వర్షాలు కురిస్తే పంటలకు కొంత ఊరట లభించే అవకాశం ఉంటుంది. అయితే వర్షాలు కురుస్తాయనే అంచనాల ఆధారంగా మాత్రమే సాగు నిర్ణయాలు తీసుకోకుండా, స్థానిక వాతావరణ సూచనలు, నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది.

రబీ సాగుపై ముందస్తు ప్రణాళిక అవసరం

జలాశయాల్లో నీటి నిల్వలు, భూగర్భ జలాల లభ్యతను అంచనా వేసుకున్న తర్వాతే రబీ సాగుపై రైతులు నిర్ణయం తీసుకోవాలి. నీటి వినియోగంలో పొదుపు పాటించడం, తక్కువ నీటితో పండే పంటలకు ప్రాధాన్యం ఇవ్వడం, అందుబాటులో ఉన్న నీటిని కీలక దశల్లో వినియోగించడం వంటి చర్యలు అవసరం. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు పంటలవారీగా సూచనలు అందించాల్సిన అవసరం ఉంది.

మన తొలివెలుగు

ఇంట్లో మంట పెట్టనున్న ఎల్ నినో !

ఎల్ నినో. ఇపుడు ఈ పదమే భయపెడుతోంది. ఇప్పటిదాకా చూసిన ఎల్ నినో అన్నది ఒక ట్రైలర్ అయితే రానున్న ఆరేడు నెలలలో వచ్చేది సూపర్ ఎల్ నినో అంటున్నారు. అది అత్యంత భయంకరంగా ఉండబోతోంది అని చెబుతున్నారు. ఏకంగా ప్రతీ ఇంట్లో మంట పెట్టనుంది అని అంచనా వేసి మరీ చెబుతున్నారు. పొయ్యి కింద పొయ్యి మీద రెండింటికీ కలిపి ఒకేసారి కరవు తీసుకుని వచ్చే పవర్ ఫుల్ సూపర్ ఎల్ నినోని దేశం చూస్తోంది. ప్రత్యేకించి దక్షిణాది రాష్ట్రాలలో దీని ప్రభావం అత్యధికం అని చెబుతున్నారు. మరి ఇంతలా ఎల్ నినో వచ్చి మీద పడితే ఏమి చేయాలి అంటే చేయాల్సిన విధంగా పొదుపు చర్యలు ఎవరి మటుకు వారు పాటిస్తే తక్కువ నష్టంతో కష్టం తో బయటపడతామని దీని గురించి అంచనా వేస్తున్న వారంతా చెబుతున్నారు ఎల్ నినోతో పాటే వెంట వచ్చేవి నీటి కొరత, అలాగే అధిక వేడిమి, నిత్యావసర ధరలు భారీగా పెరుగుదల. ఇక ఒకదానితో ఒకటి లింక్ అయి ఉన్న ప్రతీ వస్తువూ ఎల్ నినో తో తీవ్రమైన ప్రభావమే చూపిస్తుంది అంటున్నారు. ముందుగా నీటి కొరత అయితే పట్టి పీడిస్తుంది అని అంటున్నారు. భూగర్భ జలాలు దారుణంగా పడిపోవడంతో తాగేందుకు కూడా నీరు ఉండని దారుణమైన పరిస్థితులను అంతా చూడబోతున్నారు అని చెబుతున్నారు. మరి ఈ సమయంలో ఏమి చేయాలి అంటే ఉన్న నీటిని ఇప్పటి నుంచే జాగ్రత్తగా పొదుపు చేసుకోవాలి. రెండు చెంబులు వాడాల్సిన చోట ఒక చెంబు వాడాలి. అలాగే పారబోయడం, నీటిని వృధా చేయడం అసలు చేయరాదు అని అంటున్నారు. ఇక తాగేందుకే నీటి కొరత ఉంటే పంటలకు ఎలా అన్నది పెద్ద ప్రశ్న. అలా పంటలు కూడా పూర్తిగా పండని స్థితి ఉంటుంది. దాంతో అందరూ తినే బియ్యానికి కూడా ఎక్కువగా కొరత ఏర్పడుతుందని చెబుతున్నారు. ఇప్పటికే ఎల్ నినో ప్రభావం అని చూపిస్తూ బియ్యం ధరలను ఎక్కడికక్కడ పెంచేస్తున్నారు. రానున్న ఆరు నెలలలో వీటి ధరలు ఇంకా ఎక్కువగా పెరగవచ్చు అని అంటున్నారు. దాంతో అన్నం ముద్ద ప్రతీదీ ఇపుడు అత్యంత విలువ కాబోతోంది. అనవసరంగా అన్నం పారేయడం అయితే చేయవద్దు అన్నది పెద్దల మాట. ఉన్న ముద్దను జగ్రత్తగా వాడుకోవడం మరో మంచి మాట. నిత్యావసరాలు అన్నీ కేవలం బియ్యం మాత్రమే కాకుండా నిత్యావసరాలు అన్నీ కూడా అత్యధిక ధరలు పలుకుతాయి. అది సామాన్యుడు కొనలేని స్థితికి వెళ్ళిపోతాయని అంటున్నారు. పప్పుల నుంచి వంట నూనెల నుంచి ఉల్లిపాయలు, చింతపండు, వంట గ్యాస్ నుంచి అన్నీ కూడా ఆకాశాన్ని అంటేలా ధరలు పెరిగిపోతాయని అంటున్నారు. ఇక కూరగాయల ధరలు ఇప్పటికే మార్కెట్ లో అదిరిపోతున్నాయి. ఇవి ఇంకా పెరిగి కిలో వంద రూపాయలు పై దాటినా ఆశ్చర్యం లేదని అంటున్నారు. విద్యుత్ కొరత : విద్యుత్ అన్నది ఎలా తయారవుతుంది అంటే నీటి నుంచే ఎక్కువ అన్నది తెలిసిందే. పైగా ఇది చవక అయినది కూడా. మరి నీరే లేని చోట విద్యుత్ ఉత్పత్తి భారీగా తగ్గిపోతుంది. దాంతో తీవ్రమైన విద్యుత్ కొరత ఏర్పడుతుంది అని అంటున్నారు. అందుకే ఇప్పటి నుంచే కరెంట్ ని కూడా పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలి. ఎక్కువగా ఫ్యాన్లు ఏసీలు లైట్లూ వేసి వృధా చేస్తే రేపటి రోజున విద్యుత్ ఉండని నేపథ్యం ఉంటుంది. వస్తుంది కదా కరెంట్ అని ఈ రోజు ఖర్చు చేయడం కాదు తగ్గిస్తే అదే రేపటికి మనకు వెలుగు ఇస్తుంది అన్నది గుర్తెరగాలి.ఇక సూపర్ ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అనవసర ఖర్చులను అదుపు చేయాలని సూచిస్తున్నారు. వేయి రూపాయలు ఖర్చు చేయాల్సిన చోట అయిదు వందలకే పరిమితం కావాలి. విలాసం ఏదో అవసరం ఏదో గుర్తించి ఆ విధంగా మసలుకోవాలని అంటున్నారు. ఎందుకంటే పెరిగే ధరలతో డబ్బు విలువ అమాంతం పడిపోతుంది. వందకు వచ్చేది రెండు వందలకు ఎగబాక వచ్చు. అపుడు నిత్యావసరాలకే ఎక్కువ బడ్జెట్ అవుతుంది. కాబట్టి చేతిలో డబ్బు ఉంచుకోవాలి. అది ప్రాణప్రదంగా ఖర్చు చేయాలని సూచిస్తున్నారు. అయితే సూపర్ ఎల్ నినో అని భయపడి వణికిపోయి ఇప్పుడే మొత్తం సరుకులు అన్నీ కొనేసి ఇంట్లో వేసుకున్నా కూడా అది కూడా తప్పే అవుతుంది. ఎందుకంటే డిమాండ్ అండ్ సప్లై చైన్ తో సాగే ప్రపంచంలో ఈ విధంగా తొందర పడితే మరింతగా ధరలు పెరిగి ఆ ప్రభావం ఇతర

అభివృద్ధి అంటే ఆర్భాటం కాదు.. ప్రజల జీవితాల్లో మార్పు!

దేశం అభివృద్ధి చెందుతోందని చెప్పడానికి భారీ భవనాలు, విశాలమైన రహదారులు, ఆకాశహర్మ్యాలు మాత్రమే కొలమానాలు కావు. సామాన్యుడి జీవన ప్రమాణాలు మెరుగుపడినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. ప్రతి కుటుంబానికి నాణ్యమైన విద్య, అందుబాటులో వైద్యం, ఉపాధి అవకాశాలు, తాగునీరు, మెరుగైన రవాణా సదుపాయాలు అందినప్పుడే అభివృద్ధి ఫలాలు ప్రజలకు చేరినట్లు భావించాలి.

ప్రభుత్వాలు మారుతున్నాయి.. పాలకులు మారుతున్నారు.. కొత్త పథకాలు, కొత్త హామీలు తెరపైకి వస్తున్నాయి. కానీ సామాన్యుడి జీవితంలో ఎదురయ్యే సమస్యలు మాత్రం పూర్తిగా పరిష్కారం కావడం లేదు. విద్య, వైద్యం, ఉపాధి వంటి మౌలిక అంశాలపై ప్రభుత్వాలు మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలు అధికారంలోకి వచ్చిన తర్వాత కార్యాచరణలో కనిపించాలి. ప్రజాధనంతో చేపట్టే ప్రతి కార్యక్రమానికి జవాబుదారీతనం ఉండాలి.

నేటి సమాజంలో విద్య ఖరీదైన వ్యవహారంగా మారుతోంది. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల భారం మధ్యతరగతి కుటుంబాలను ఆర్థికంగా కుంగదీస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, ఉపాధ్యాయుల కొరత వంటి సమస్యలు పరిష్కారం కావాలి. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం ప్రభుత్వాల ప్రథమ బాధ్యతగా ఉండాలి. అలాగే వైద్యం సామాన్యుడికి అందని భారంగా మారకుండా ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాలి.

మరోవైపు నిరుద్యోగం యువతను తీవ్రంగా వేధిస్తోంది. ఉన్నత చదువులు పూర్తి చేసినప్పటికీ తగిన ఉద్యోగాలు లభించక ఎంతోమంది నిరాశకు గురవుతున్నారు. ఉద్యోగాల భర్తీతో పాటు పరిశ్రమల స్థాపన, నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధికి ప్రోత్సాహం అవసరం. వ్యవసాయ రంగాన్ని కూడా నిర్లక్ష్యం చేయకూడదు. రైతుకు గిట్టుబాటు ధర, సాగునీరు, నాణ్యమైన విత్తనాలు, అవసరమైన సమయంలో పెట్టుబడి సాయం అందాలి.

అభివృద్ధి పేరుతో చేసే ప్రతి ఖర్చు ప్రజలకు ఉపయోగపడుతోందా లేదా అన్నది పరిశీలించాలి. ప్రాజెక్టులు ప్రారంభించడం ఎంత ముఖ్యమో, వాటిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అంతకంటే ముఖ్యం. ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత ఉండాలి. అవినీతి, జాప్యం, రాజకీయ జోక్యానికి తావులేకుండా పాలన సాగాలి. ప్రజాస్వామ్యంలో ప్రజలే పాలకులకు అసలైన జవాబుదారీ వ్యవస్థ. ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించడం, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, హక్కుల కోసం గొంతెత్తడం ప్రజల బాధ్యత. అదే సమయంలో ప్రజల ఆకాంక్షలను గౌరవించి, విమర్శలను స్వీకరించి, తప్పులను సరిదిద్దుకోవడం పాలకుల బాధ్యత.

అధికారంలో ఎవరు ఉన్నారన్నది కాదు.. ప్రజల జీవితాల్లో ఎంతటి మార్పు తీసుకొచ్చారన్నదే పాలనకు అసలైన కొలమానం. అభివృద్ధి ప్రచారంలో కాదు.. ప్రజల అనుభవంలో కనిపించాలి!



ప్రజలకు కావాల్సింది వాగ్దానాల వర్షం కాదు.. సమస్యలకు శాశ్వత పరిష్కారం. ప్రారంభోత్సవాల ఆర్భాటం కాదు.. పూర్తయిన పనుల ఫలితం. ప్రచారంలో కనిపించే అభివృద్ధి కాదు.. ప్రతి ఇంటి గడపలో అనుభూతి చెందే మార్పు. ప్రజాధనంతో పాలన సాగించే ప్రతి ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. అధికారం అనేది హోదా కాదు.. ప్రజలకు సేవ చేసే బాధ్యత. ఈ సత్యాన్ని పాలకులు గుర్తించినప్పుడే ప్రజాస్వామ్యానికి నిజమైన అర్థం, అభివృద్ధికి అసలైన పరమార్థం సిద్ధిస్తాయి. ప్రజల బతుకులు మారనప్పుడు ఎంతటి అభివృద్ధి గణాంకాలైనా నిరర్థకమే.. ప్రజల జీవితాల్లో వెలుగులు నింపినప్పుడే అది నిజమైన ప్రగతి!

ధరల రోగానికి ఇదా చికిత్స?!

నియంత్రించాల్సిన వ్యవస్థలు నోరుమూసుకుంటే, పర్యవేక్షణ చేయాల్సిన ప్రభుత్వం పట్టనట్టుంటే జరిగేదేమిటో ప్రాణాంతక కేన్సర్ వ్యాధికి వాడే ఔషధాల ధరలు చుక్కలనంటడం చూస్తే స్పష్టంగా అర్థమవుతుంది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వమూ, జాతీయ ఔషధ ధరల ప్రాధికార సంస్థ (ఎన్‌పీపీఏ) ప్రదర్శిస్తున్న అంతులేని నిర్లక్ష్యాన్ని సర్వోన్నత న్యాయస్థానం మొన్న మంగళవారం తీవ్రంగా దుయ్యబట్టాక ఆ వెంటనేకొంత కదలిక వచ్చిన జాడలు కనబడ్డాయి. అంతక్రితమే సుప్రీంకోర్టులో ఈ కేసు విచారణ సాగుతుండగా ఎంపికచేసిన 137 ఔషధాల గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్‌పీ)పై నియంత్రణ విధిస్తూ కేంద్రం ఆదేశాలిచ్చింది. వచ్చే నెల 9నుంచి అమల్లోకొచ్చేలా వీటి ధరలు తగ్గించామని ఉత్పత్తిదారులు ప్రకటించారు. మంచిదే. అయితే మొత్తం 543 కేన్సర్ ఔషధ రకాల్లో వీటి సంఖ్య ఏపాటి? చావు కబురు చల్లగా చెప్పినట్టు పేటెంటు, లైసెన్సు, ఇతర రకాల పరిరక్షణ వ్యవస్థల పరిధిలోకొచ్చే ఔషధాలకు మాత్రం ఈతగ్గింపు వర్తించదంటున్నారు ఉత్పత్తిదారులు.

ప్రజలందరి మేలూ కోరే ఆర్థిక వ్యవస్థ లేనిచోట నిరుద్యోగం, పేదరికం, అజ్ఞానం, అనారోగ్యంవంటి సమస్త రుగ్మతలూ ముసురుకుంటాయని కెనడాకు చెందిన ప్రజా వైద్యుడు డాక్టర్ నార్మన్ బెతూన్ చెప్పి దశాబ్దాలు దాటుతోంది. దాదాపు అన్ని ప్రభుత్వాలూ తమ ఆచరణ ద్వారా ఆయన చెప్పింది నూరుశాతం నిజమని నిరూపి స్తున్నాయి. ఉదాహరణకు ఊపిరితిత్తులతోపాటు పలు ఇతర కేన్సర్లకు వాడే మెర్క్‌కంపెనీ ఔషధం వంద మిల్లీగ్రాముల టీకా ధర రూ. 2.16 లక్షలు. ఇంత ధర వెచ్చించటం సాధారణ రోగులకు సాధ్యమేనా? 21 మాత్రలుగా ఉండే ఇమ్యూనోథెరపీ ఔషధం200 మిల్లీగ్రాముల ధర రూ. 24,435. ఈ రెండు రకాల ఔషధాలూ జాబితాలో లేవు. ఇవేకాదు... రూ. 10 లక్షల ఖరీదుచేసే మరో ఔషధం కూడా జాబితాలో గల్లంతయింది! అలాగే చాలావాటి ధరలు స్వల్పంగా... అంటే రూ. 100లోపే తగ్గాయి. రొమ్ము, ప్రోస్టేట్ తదితర కేన్సర్లకు వినియోగించే నాలుగైదు రకాల ఔషధాలు మాత్రం గణనీయంగా తగ్గాయి. ఉదాహరణకు కీమోథెరపీలో వాడే ఔషధం ధర రూ. 80,071 నుంచి రూ.



7,150కి, రొమ్ము కేన్సర్‌కు వాడే ఔషధం ధర రూ. 40,421 నుంచి రూ. 2,720కి, బహుళ కేన్సర్లకు వాడే ఔషధం ధర రూ. 69,852 నుంచి రూ. 13,512కు తగ్గాయి.

అసలు ఎంఆర్‌పీపై నియంత్రణ సరిపోతుందనుకోవటమే లోపభూయిష్టం.తగ్గించామని ఘనంగా చెప్పుకున్నంతసేపు పట్టదు అవి పెరగటానికి. ముడి సరుకుల ధరలు పెరిగితే అవి పైపైకి పోతాయి. చాలా రకాల ఔషధాలకు లక్షల రూపాయల ధర పెట్టడం వెనక అవి ప్రాణరక్షణకు ప్రభావవంతంగా తోడ్పడటంతప్ప మరేవిధమైన హేతుబద్ధతా లేదు. ఉత్పత్తిదారుల దగ్గర ధరను నియంత్రిస్తే వేరు. ఉదాహరణకు ఒక ఔషధ తయారీకయ్యే వ్యయానికి ఉత్పత్తిదారులు 42.8 శాతం అదనంగా వేసుకుని స్టాకిస్టులకు విక్రయిస్తారు. రోగులకెళ్లేలోగా మరిన్ని అంచెలుంటాయి. కొన్ని సందర్భాల్లో ఆస్పత్రులే నేరుగా కొని విక్రయిస్తాయి. ఈ క్రమంలో ప్రతిచోటా అదనపు లాభం వేసుకుంటూపోతారు. ఎంఆర్‌పీపై కేంద్రీకరిస్తే ఈ లాభార్జన స్వల్పంగా తగ్గుతుంది. ఆస్పత్రులైతే మందులపై 'కోల్పోయిన' దాన్ని గది అద్దె పెంచటంద్వారానో, మరో రకంగానో వసూలు చేస్తాయి. గతంతో పోలిస్తే కేన్సర్ మహమ్మారి విస్తృతి పెరిగింది. గ్రామాలు, నగరాలన్న తేడా లేకుండా అందరినీ కాటేస్తోంది. కారణాలు అందరికీ తెలుసు. సాగులో ఎరువులవాడకం, అధిక పాల ఉత్పత్తి కోసం పశువులకు విచక్షణారహితంగా ఇంజెక్షన్లివ్వటం, వాతావరణ కాలుష్యం, నదులు, భూగర్భ జలాల కాలుష్యం, ప్రమాదకరమైన ఆహార విక్రయాలు... ఇవన్నీ కేన్సర్ కారకాలు. సారాంశంలో ప్రభుత్వ విధానాలు కావొచ్చు... వాటి నిర్వ?్యవపకత కావొచ్చు... ఈ ప్రాణాంతక వ్యాధికి మూలం. ప్రత్యక్షంగాలేదా పరోక్షంగా తామే ఈ మరణమృదంగానికి కారణమవుతూ... కనీసం ఔషధాల ధరలైనా సరిగా నియంత్రించలేనప్పుడు ప్రభుత్వాలుండి ఏం ప్రయోజనం? అందుకేకంటితుడుపు చర్యలు మానుకుని వాస్తవంగా జనానికి లబ్ధి చేకూరే విధానాలు అమల్లోకి తీసుకురావాలి.

ఇస్రో ప్రయోగం సక్సెస్..

న్యూఢిల్లీ భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఖాతాలో మరో అద్భుత విజయం చేరింది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోటలో ఉన్న సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్18 రాకెట్ ద్వారా ఎన్‌వీఎస్-03 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించింది. ఈ ప్రయోగం విజయవంతం కావడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజనీర్ల బృందాన్ని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు. "జీఎస్ఎల్వీ-ఎఫ్18 ద్వారా ఎన్‌వీఎస్-03 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించిన ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజనీర్లకు నా అభినందనలు. మన స్వదేశీ నావిగేషన్ వ్యవస్థ 'నావిక్'ను బలోపేతం చేయడంలో ఈ ప్రయోగం ఒక ముఖ్యమైన ముందడుగు" అని ఆయన పేర్కొన్నారు. అత్యాధునిక సామర్థ్యాలతో కూడిన ఈ ఉపగ్రహం, కీలక సాంకేతికతల్లో దేశం ఆత్మనిర్భరత సాధించేందుకు మరింత దోహదపడుతుందని తెలిపారు. ప్రజలకు మెరుగైన నావిగేషన్ సేవలు అందించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. మన అంతరిక్ష శాస్త్రవేత్తల అంకితభావం, నైపుణ్యం దేశానికి గర్వకారణంగా నిలుస్తున్నాయని మోదీ కొనియాడారు. 'నావిగేషన్ విత్ ఇండియన్ కాన్‌స్టలేషన్' (నావిక్) అనేది భారత్ సొంతంగా అభివృద్ధి చేసుకున్న ప్రాంతీయ నావిగేషన్ వ్యవస్థ. అమెరికాకు చెందిన జీపీఎస్ తరహాలోనే ఇది పనిచేస్తుంది. దేశ భద్రత, రవాణా, విపత్తుల నిర్వహణ, పౌర సేవలు వంటి అనేక రంగాల్లో కచ్చితమైన పొజిషనింగ్, టైమింగ్ సేవలను అందించడం దీని లక్ష్యం. ప్రస్తుతం ప్రయోగించిన ఎన్‌వీఎస్-03, నావిక్ కోసం రూపొందించిన రెండో తరం ఉపగ్రహాల్లో ఒకటి. ఇది నావిక్ వ్యవస్థకు మరింత శక్తిని అందించి, దాని సేవలను మరింత విస్తృతం చేయనుంది. ఈ ఉపగ్రహంలో స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసిన అటామిక్ క్లాక్ ఉండటం విశేషం. ఈ విజయంతో అంతరిక్ష రంగంలో స్వావలంబన దిశగా భారత్ మరో కీలక ముందడుగు వేసినట్లయింది.

పట్టభద్రుల ఓటరు నమోదుపై అవగాహన

అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలి

తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు



మన తొలివెలుగు । జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి గడ్డం సుధాకర్ । అక్టోబర్ 31, 2026: జోగులాంబ గద్వాల జిల్లా ఐజ మండలంలోని సింధనూరు గ్రామంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ నాయకుడు ఉప్పరి గంగాధర్ నేతృత్వంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలకు, డిగ్రీ పూర్తి చేసిన యువతీ యువకులకు పట్టభద్రుల ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమని, తమ అభిప్రాయాలను ఓటు ద్వారా ప్రతిబింబించే అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత రాజకీయ చైతన్యంతో ముందుకు రావాలని, పట్టభద్రుల హక్కుల పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీ. మహాదేవ్ పటేల్, పార్తప్ప, నరసింహులు, టీ. నందిని, కే. అనురాధ, టీ. రామకృష్ణమ్మ, టీ. సునీత, టీ. వెంకటేశ్వరి, పి. సంధ్య, యు. అనురాధ, యు. వీరేష్ బాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఐజ మండల సలహాదారుడు బసవ స్వామి, మండల ఉపాధ్యక్షుడు సి. భీమేష్ పాల్గొన్నారు.

ఇందిరాగాంధీకి ఘన నివాళులు

ఢిల్లీకి గోషామహల్ కాంగ్రెస్ నేతలు

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌తో కలిసి నివాళులర్పించిన నాయకులు

తెలంగాణలో కాంగ్రెస్ బలోపేతం, గోషామహల్ నియోజకవర్గ అభివృద్ధిపై చర్చలు



మన తొలివెలుగు ।తెలంగాణ బ్యూరో ప్రతినిధి సాయి కిషోర్ కనుగుల । అక్టోబర్ 31, 2026 : మాజీ ప్రధానమంత్రి, దివంగత ఇందిరాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని గోషామహల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఢిల్లీలో ఘనంగా నివాళులర్పించారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపు మేరకు ఢిల్లీకి చేరుకున్న నాయకులు, ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సునీతారావు ఆధ్వర్యంలో నిర్వహించిన నివాళుల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌తో కలిసి ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడం, గోషామహల్ నియోజకవర్గ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించినట్లు తెలిపారు. ఈ విషయాలను ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బద్దం సతీష్ గౌడ్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇఫ్తేఖర్ అలీ, మధుసూదన్, మల్లేష్ యాదవ్, శ్రవణ్ కుమార్, అరుణ్ కుమార్, కొండల్ నాగరాజు తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గుమ్మడిదొడ్డిలో ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు

జాతీయ సమగ్రతకు పటేల్ చేసిన సేవలు చిరస్మరణీయం

సర్పంచ్ భరత్ కుమార్



మన తొలివెలుగు । వాజేడు ప్రతినిధి వై. సర్వేశ్వరరావు । అక్టోబర్ 31, 2026 : గుమ్మడిదొడ్డి గ్రామ పంచాయతీలో భారత ఉక్కు మనిషి, స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భరత్ కుమార్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం అనంతరం దేశంలోని 500కు పైగా సంస్థానాలను భారత యూనియన్‌లో విలీనం చేసి, జాతీయ సమగ్రతకు పటిష్టమైన పునాది వేసిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని కొనియాడారు. 1875 అక్టోబర్ 31న జన్మించిన ఆయన, దేశ ఐక్యత కోసం చేసిన కృషి చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. పటేల్ జన్మదినాన్ని ఏటా జాతీయ ఐక్యతా దినోత్సవంగా జరుపుకోవడం ఆయన సేవలకు దేశం అందిస్తున్న గౌరవమని తెలిపారు. దేశ ఐక్యత, సమగ్రత, క్రమశిక్షణ, అంకితభావం, దృఢమైన నాయకత్వ లక్షణాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీపీవో వెంకయ్య, ఉపసర్పంచ్ రాజశ్రీ, పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్, వేణు, కార్తీక్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నెట్టెంపాడు కాలువలో వృథాగా పారుతున్న సాగునీరు!





అధికారుల నిర్లక్ష్యంతో నీటి వృథా.. ఆందోళనలో రైతులు

నీటి ప్రతి చుక్కను పొదుపు చేయాలంటున్న ప్రభుత్వం

క్షేత్రస్థాయిలో కనిపించని చర్యలు

మన తొలివెలుగు । జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి గడ్డం సుధాకర్ । అక్టోబర్ 31, 2026 : ధరూర్ మండల పరిధిలోని నెట్టెంపాడు ఇరిగేషన్ కాలువ నుంచి సాగునీరు వృథాగా బయటకు పోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువ ద్వారా విలువైన సాగునీరు వృథా అవుతుంటే అరికట్టాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని రైతులు విమర్శిస్తున్నారు. ఒకవైపు నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని ప్రభుత్వం ప్రజలకు, రైతులకు సూచిస్తుండగా.. మరోవైపు క్షేత్రస్థాయిలో నీటి వృథాను అరికట్టేందుకు అవసరమైన చర్యలు కనిపించడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలువలో నీటి లీకేజీలను



గుర్తించి మరమ్మతులు చేపట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నప్పటికీ నిర్లక్ష్యం కొనసాగుతోందని ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా, రాబోయే రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి కరువు పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందన్న ఆందోళన రైతుల్లో నెలకొంది. ఇప్పటికే వాతావరణ మార్పులపై ఆందోళన చెందుతున్న రైతులకు, అందుబాటులో ఉన్న సాగునీరు సైతం వృథాగా పోవడం మరింత ఆవేదన కలిగిస్తోంది. భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడితే పంటల సాగుపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించాలి!

నెట్టెంపాడు కాలువలో నీటి వృథాకు గల కారణాలను గుర్తించి, లీకేజీలను తక్షణమే అరికట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కాలువను క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టడంతో పాటు, సాగునీరు చివరి ఆయకట్టు వరకు సక్రమంగా చేరేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. నీటి విలువను గుర్తించి అధికారులు ఇప్పటికైనా నిర్లక్ష్యాన్ని వీడి రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సర్దార్ పటేల్ జయంతి సందర్భంగా పేరూరులో 2కే రన్

జాతీయ సమగ్రతకు పటేల్ చేసిన సేవలు చిరస్మరణీయం

-- సీఆర్పీఎఫ్ కమాండర్ హనుమంతరావు



మన తొలివెలుగు । వాజేడు ప్రతినిధి: వై. సర్వేశ్వరరావు । అక్టోబర్ 31, 2026 : భారతదేశ ఉక్కు మనిషి, దేశ తొలి ఉప ప్రధానమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని పేరూరులో సీఆర్పీఎఫ్ బలగాల ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించారు. సీఆర్పీఎఫ్ 39వ బెటాలియన్ కమాండర్ హనుమంతరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, సీఆర్పీఎఫ్ జవాన్లు, స్థానిక యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమాండర్ హనుమంతరావు మాట్లాడుతూ.. దేశంలోని 500కు పైగా సంస్థానాలను భారత యూనియన్‌లో విలీనం చేయడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారని, జాతీయ సమగ్రతకు బలమైన పునాది వేశారని కొనియాడారు. 1875 అక్టోబర్ 31న జన్మించిన పటేల్, దేశ ఐక్యత కోసం చేసిన కృషి భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని ఏటా అక్టోబర్ 31న దేశవ్యాప్తంగా జాతీయ ఐక్యతా దినోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. పటేల్ చూపిన దేశభక్తి, క్రమశిక్షణ, అంకితభావం, నాయకత్వ లక్షణాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పేరూరు ఎస్ఐ అశోక్, పోలీస్ శాఖ సిబ్బంది, సీఆర్పీఎఫ్ 39వ బెటాలియన్ జవాన్లు, స్థానిక గ్రామ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

అనుమానాస్పద ఫోన్ కాల్స్ వస్తే వెంటనే 1930కు డయల్ చేయండి

టేకులపేటలో సీఆర్పీఎఫ్, ప్రత్యేక పోలీసు బలగాల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం



మన తొలివెలుగు । వాజేడు ప్రతినిధి వై. సర్వేశ్వరరావు । అక్టోబర్ 31, 2026: ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, లింకుల పట్ల జాగ్రత్త వహించాలని పేరూరు పోలీసులు సూచించారు. సైబర్ మోసానికి గురైనట్లయితే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని పిలుపునిచ్చారు. పేరూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్మవరం సమీపంలోని టేకులపేట గ్రామంలో సీఆర్పీఎఫ్ పోలీసులు, ఆయుధధారులైన ప్రత్యేక బలగాల ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిటల్ లావాదేవీలు, ఆన్‌లైన్ సేవల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గ్రామస్తులకు వివరించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో మొబైల్ ఫోన్ భద్రత ఎంతో ముఖ్యమని, వ్యక్తిగత ఫోన్లను ఇతరుల చేతికి ఇవ్వకూడదని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపించే లింకులపై క్లిక్ చేయడం, అనధికారిక యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకోవడం వల్ల సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకునే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అలాగే బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం కార్డు సమాచారం, రహస్య పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని స్పష్టం చేశారు. బ్యాంకు అధికారులు, ప్రభుత్వ సిబ్బంది పేరుతో ఫోన్ చేసి వ్యక్తిగత వివరాలు అడిగినా స్పందించవద్దని సూచించారు. సైబర్ నేరగాళ్ల మోసపూరిత మాటలకు ఆకర్షితులై కష్టపడి సంపాదించిన డబ్బును పోగొట్టుకోవద్దని, ప్రతి ఒక్కరూ డిజిటల్ లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు కోరారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ, కానిస్టేబుల్ మారేశ్వరరావు, హోంగార్డు రఘు తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఢిల్లీకి బయలుదేరిన భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

ఓటు బచావో - భారత్ బచావో నినాదంతో రామ్‌లీలా మైదానంలో మెగా ర్యాలీ



మన తొలివెలుగు, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి జంగిటి రవీందర్, అక్టోబర్ 31, 2026: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పిలుపు మేరకు నవంబర్ 1న ఢిల్లీలోని చారిత్రాత్మక రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న 'ఓటు బచావో - - భారత్ బచావో' మెగా ర్యాలీలో పాల్గొనేందుకు భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఢిల్లీకి బయలుదేరారు. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు ప్రాధాన్యత, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో ఈ సభకు హాజరుకానున్నారు. రాహుల్ గాంధీ పిలుపుతో నిర్వహిస్తున్న ఈ జాతీయ స్థాయి కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొననుండటంతో జిల్లా కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఫ్లాష్ వాక్

ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పోలీసుల సూచన





మన తొలివెలుగు । యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి జంగిటి రవీందర్ । అక్టోబర్ 31, 2026: పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా యాదాద్రి భువనగిరి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలో సైబర్ సెక్యూరిటీ ఫ్లాష్ వాక్ నిర్వహించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల ముగింపు సందర్భంగా జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సైబర్ భద్రత, ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ లావాదేవీల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత సమాచార పరిరక్షణ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లు వివిధ మార్గాల్లో అమాయక ప్రజలను మోసగిస్తున్నారని, వారి వలలో చిక్కుకోకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ముఖ్యంగా గుర్తుతెలియని వ్యక్తులు పంపే అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని, అపరిచితుల ఫోన్ కాల్స్, సందేశాలను నమ్మి బ్యాంకు వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు వెల్లడించవద్దని సూచించారు. డిజిటల్ లావాదేవీల్లో తగిన జాగ్రత్తలు పాటిస్తూ వ్యక్తిగత సమాచారాన్ని భద్రంగా ఉంచుకోవాలని తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణ కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సైబర్ భద్రతా నియమాలను పాటించడంతో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితులు, పరిచయస్తులకు సైతం అవగాహన కల్పించాలని పోలీసులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భువనగిరి డీఎస్పీ రవీందర్, సీఐలు వెంకటేశ్వర్లు, చంద్రబాబు, సూర్య నాయక్, ఎస్ఐలు అనిల్, లక్ష్మీనర్సయ్యతో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏజెన్సీ భూములను రక్షించాలి

1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

గిరిజనేతరుల ఆక్రమణల్లో ఉన్న భూములను స్వాధీనం చేసుకుని నిరుపేద ఆదివాసీలకు పంపిణీ చేయాలి

గొండ్వాన సంక్షేమ పరిషత్ జిల్లా కార్యదర్శి జజ్జరి సత్యనారాయణ డిమాండ్

మన తొలివెలుగు । వాజేడు ప్రతినిధి: వై. సర్వేశ్వరరావు । అక్టోబర్ 31, 2026 : ఏజెన్సీ ప్రాంతాల్లో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ, గిరిజన భూములను పరిరక్షించడంతో పాటు, ఐదో షెడ్యూల్ పరిధిలోని 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని గొండ్వాన సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా కార్యదర్శి జజ్జరి సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిజనేతరుల ఆక్రమణల్లో ఉన్న భూములను తక్షణమే సర్వే చేసి, అర్హులైన నిరుపేద ఆదివాసీలకు పంపిణీ చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతాలకు వలస వచ్చిన కొందరు చట్టాలకు విరుద్ధంగా భూములను ఆక్రమించి రియల్ ఎస్టేట్ వ్యాపారాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి వ్యవహారాలపై సంబంధిత అధికారులు స్పందించకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. భూ ఆక్రమణలపై సమగ్ర విచారణ చేపట్టి, అక్రమంగా ఆక్రమణకు గురైన వేలాది ఎకరాల భూములను గుర్తించి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. వలస నిరోధక చట్టాలను సమర్థవంతంగా అమలు చేసి, నిబంధనలకు విరుద్ధంగా ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తూ భూములను ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన చట్టపరమైన ప్రక్రియ అనంతరం అర్హులైన ఆదివాసీలకు భూములపై హక్కులు కల్పించాలని కోరారు. తరతరాలుగా ఆదివాసీల భూమి, హక్కులు, జీవనాధారాన్ని కాపాడేందుకు రూపొందించిన చట్టాల అమలులో నిర్లక్ష్యం చోటుచేసుకోవడం బాధాకరమని సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఐటీడీఏ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేసి ఏజెన్సీ ప్రాంతాల్లో భూ ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని ఆయన కోరారు.



బడంగ్‌పేట్‌లో అధికారిపై పోస్టర్ల కలకలం!

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్లియరెన్స్‌లో తీవ్ర జాప్యం..

డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటూ ఆరోపణలు

పెండింగ్‌లో ఫైళ్లు.. కార్యాలయం తలుపులకు పోస్టర్లు

అవినీతి ఆరోపణలపై ఉన్నతాధికారులు విచారణ జరపాలని బాధితుల డిమాండ్

మన తొలివెలుగు । మహేశ్వరం ప్రతినిధి: ముత్తయ్య । అక్టోబర్ 31, 2026 : ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతోందంటూ బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయంలో వెలిసిన పోస్టర్లు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్లియర్ చేయాల్సిన అధికారి అందుబాటులో ఉండటం లేదని, నెలల తరబడి ఫైళ్లను పెండింగ్‌లో ఉంచుతున్నారని ఆరోపిస్తూ కార్యాలయ ద్వారాలకు పోస్టర్లు అంటించడం చర్చనీయాంశంగా మారింది. బడంగ్‌పేట్ సర్కిల్‌కు చెందిన టౌన్ ప్లానింగ్ అధికారి మహమ్మద్ యాసిన్‌పై పలువురు దరఖాస్తుదారులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఎల్ఆర్ఎస్ క్లియరెన్స్ కోసం భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, అడిగినంత ఇవ్వకపోతే దరఖాస్తుల పరిష్కారంలో కావాలనే జాప్యం చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణంగా తమ ఫైళ్లు నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాయని వాపోతున్నారు.



పోస్టర్లతో నిరసన.. అధికారుల స్పందన ఏదీ?

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో ఎదురవుతున్న ఇబ్బందులు, అధికారి అందుబాటులో లేకపోవడం, అవినీతి ఆరోపణలను ప్రస్తావిస్తూ గుర్తుతెలియని వ్యక్తులు కార్యాలయ ద్వారాలకు పోస్టర్లు అంటించినట్లు తెలుస్తోంది. దీంతో బడంగ్‌పేట్ సర్కిల్ వర్గాల్లో ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. శంషాబాద్ జోన్ పరిధిలో ఎల్ఆర్ఎస్‌కు సంబంధించిన ప్రత్యేక అధికారిగా మహమ్మద్ యాసిన్‌ను నియమించినట్లు సమాచారం. అయితే, దరఖాస్తుల పరిష్కారంలో ఆయన వ్యవహారశైలిపై గతంలోనూ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది.

ఆరోపణలపై విచారణ జరిపేదెప్పుడు?

ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిష్కారం కావాల్సిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు అధికారుల నిర్లక్ష్యం, జాప్యం కారణంగా పెండింగ్‌లో ఉండటం వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే భూముల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకుని ఎదురుచూస్తున్న వారికి ఈ జాప్యం భారంగా మారుతోంది. మహమ్మద్ యాసిన్‌పై వస్తున్న అవినీతి ఆరోపణలపై సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని బాధితులు కోరుతున్నారు. ఆరోపణల్లో వాస్తవాలను నిగ్గుతేల్చేందుకు సమగ్ర విచారణ చేపట్టాలని, డబ్బులు డిమాండ్ చేసినట్లు నిర్ధారణ అయితే బాధ్యుడైన అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను ఎలాంటి జాప్యం లేకుండా పారదర్శకంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల భూముల క్రమబద్ధీకరణకు సంబంధించిన దరఖాస్తులే నెలల తరబడి పెండింగ్‌లో ఉంటే.. సామాన్యుల సమస్యలను పరిష్కరించేది ఎవరు? పోస్టర్ల రూపంలో వ్యక్తమవుతున్న అసంతృప్తికి ఉన్నతాధికారులు సమాధానం చెబుతారా? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

తాగునీటి సమస్యపై ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలి

సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రత్యామ్నాయ నీటి సరఫరా ఏర్పాటు చేయాలి

మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య । అక్టోబర్ 31, 2026 : ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొని, అక్టోబర్ నెలలోనే పలు ప్రాంతాల్లో తాగునీటి సమస్య తీవ్రతరం కావడం ఆందోళన కలిగిస్తోందని బీఆర్ఎస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ కార్యదర్శి సామ మహేందర్ రెడ్డి అన్నారు. కందుకూరు మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో చెరువులు, కుంటలు, కాల్వల్లో నీటి నిల్వలు తగ్గిపోతున్నాయని, ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న వేసవిలో తాగునీటి కొరత మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అక్టోబర్ నెలలోనే ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతుంటే.. రాబోయే ఎండాకాలంలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ సురక్షిత తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టామని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఈ పథకం నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలకు నిరంతరాయంగా మంచినీటి సరఫరా జరిగేలా చూడాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికైనా అప్రమత్తమై తాగునీటి సమస్య ఎదుర్కొంటున్న గ్రామాలు, ప్రాంతాలను ముందుగానే గుర్తించాలని డిమాండ్ చేశారు. అవసరమైన చోట ప్రత్యామ్నాయ నీటి వనరులను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టాలని సూచించారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించాలని కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుతో పాటు కనీస అవసరమైన తాగునీటిని అందించడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని సామ మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు.



కార్మికుల హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటం

ప్రజా సంక్షేమం కోసం నిరంతరం ఉద్యమిస్తాం

ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు కొమ్మగళ్ల రాజు

మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య, అక్టోబర్ 31, 2026: కార్మికుల హక్కుల పరిరక్షణతో పాటు ప్రజా సంక్షేమం కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాటాలు కొనసాగిస్తుందని ఆ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు కొమ్మగళ్ల రాజు స్పష్టం చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. కందుకూరు మండల కేంద్రంలో ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొమ్మగళ్ల రాజు మాట్లాడుతూ.. 1920 అక్టోబర్ 31న లాలా లజపతిరాయ్ అధ్యక్షతన ఏఐటీయూసీ ఏర్పాటైందని గుర్తుచేశారు. అప్పటి నుంచి నేటి వరకు ఎన్నో పోరాటాలు, త్యాగాల ద్వారా కార్మికుల హక్కుల సాధనకు, ప్రజా సంక్షేమానికి సంఘం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల స్థాపన, పరిరక్షణలో ఏఐటీయూసీ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు చేపట్టిన చరిత్ర తమ సంఘానికి ఉందన్నారు. అయినప్పటికీ నేటికీ కార్మికుల సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల ప్రయోజనాల కంటే కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకే కేంద్ర ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇస్తున్నాయని విమర్శించారు. కార్మికుల హక్కుల సాధన, ఉపాధి భద్రత, న్యాయమైన వేతనాలు, సంక్షేమం కోసం కార్మికులంతా ఐక్యంగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ కందుకూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు యాదగిరి, ప్రవీణ్ రాజు, బాలరాజు, కవిత, నరసింహ, రవి తదితరులు పాల్గొన్నారు.



భువనగిరి సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్

పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి రికార్డుల నిర్వహణలో పారదర్శకత, క్రమశిక్షణ పాటించాలి



మన తొలివెలుగు । యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి జంగిటి రవీందర్ । అక్టోబర్ 31, 2026: పోలీస్ శాఖలో పరిపాలనా సామర్థ్యం, రికార్డుల నిర్వహణ, కేసుల పురోగతిని సమీక్షించేందుకు జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ శుక్రవారం భువనగిరి సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయాన్ని వార్షిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని వివిధ రికార్డులు, రిజిస్టర్లు, ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. తనిఖీలో భాగంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించిన పిటిషన్లు, సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ఫైళ్లు, ఎస్డీపీఓ సందర్శనలు, తనిఖీల రికార్డులు, గ్రేవ్ క్రైమ్ రిజిస్టర్‌తో పాటు జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్సీ), రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (ఎస్‌హెచ్ఆర్సీ)కు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కార్యాలయ రికార్డుల నిర్వహణలో పూర్తి పారదర్శకత పాటించాలని, ప్రతి ఫైల్‌ను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ క్రమపద్ధతిలో భద్రపరచాలని సూచించారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ ఫిర్యాదులు, మానవ హక్కుల కమిషన్ల నుంచి అందే పిటిషన్లపై నిర్దేశిత గడువులోగా స్పందించి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కేసులు, ఫైళ్లను నిర్లక్ష్యం చేయకుండా వాటి పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. కార్యాలయ నిర్వహణలో క్రమశిక్షణ, జవాబుదారీతనం, సమయపాలన తప్పనిసరిగా పాటించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ వార్షిక తనిఖీలో భువనగిరి డీఎస్పీ రవీందర్, సీఐలు వెంకటేశ్వర్లు, చంద్రబాబు, సూర్య నాయక్, ఎస్సైలు లక్ష్మీనర్సయ్య, శ్రీశైలం, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

క్వించ్ అరేబియన్ మండి ప్రారంభోత్సవానికి సబితా ఇంద్రారెడ్డి, కార్తీక్ రెడ్డికి ప్రత్యేక ఆహ్వానం

మన తొలివెలుగు । మహేశ్వరం ప్రతినిధి: ముత్తయ్య । అక్టోబర్ 31, 2026 : రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో నూతనంగా ప్రారంభం కానున్న క్వించ్ అరేబియన్ మండి ప్రారంభోత్సవానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, కార్తీక్ రెడ్డికి ప్రత్యేక ఆహ్వానం అందింది. రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిల్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ సుభాష్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, సీనియర్ నాయకులు సబితా ఇంద్రారెడ్డి, కార్తీక్ రెడ్డిలను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హైదర్‌గూడ డివిజన్‌లోని పిల్లర్ నంబర్ 145 సమీపంలో ఆదివారం సాయంత్రం ప్రారంభం కానున్న క్వించ్ అరేబియన్ మండి ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరై ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆహ్వాన పత్రికను స్వీకరించిన సబితా ఇంద్రారెడ్డి, కార్తీక్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ ప్రారంభోత్సవానికి తప్పకుండా హాజరవుతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నూతన వ్యాపార సంస్థల ఏర్పాటుతో స్థానికంగా వాణిజ్య కార్యకలాపాలు విస్తరించడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అభిప్రాయపడ్డారు. క్వించ్ అరేబియన్ మండి నిర్వాహకులకు ముందస్తు శుభాకాంక్షలు తెలియజేస్తూ, సంస్థ దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు డి. రమేష్ ముదిరాజ్, జె. చిత్తారి, హైదర్‌గూడ డివిజన్ అధ్యక్షుడు నరేంద్ర రావు, కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్, నాయకులు అజయ్, ప్రీతం, శ్రీవర్ధన్ రెడ్డి, మన్నె శివ ముదిరాజ్, వాసు బాబు తదితరులు పాల్గొన్నారు.





ఎస్ఐఆర్‌తో ఓటు హక్కుకు ముప్పు

కొండమడుగు నర్సింహ

నవంబర్ 1న చలో ఢిల్లీని జయప్రదం చేయాలి



మన తొలివెలుగు । యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి జంగిటి రవీందర్ । అక్టోబర్ 31: ఎస్ఐఆర్ పేరుతో దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఓటర్ల పేర్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ ఆరోపించారు. పేదలు, దళితులు, మైనారిటీలు, వెనుకబడిన వర్గాల ఓటు హక్కుకు ముప్పు ఏర్పడుతోందని అన్నారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. శనివారం భువనగిరి సుందరయ్య భవన్‌లో నిర్వహించిన 'ఓట్ చోర్' స్టడీ సర్కిల్‌లో ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో నిర్వహించే చలో ఢిల్లీ నిరసనకు ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

నవంబర్ 3న కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయ హుండీల లెక్కింపు

మన తొలివెలుగు । భీమదేవరపల్లి ప్రతినిధి కదిరె స్వామి । అక్టోబర్ 31,2026: భీమదేవరపల్లి మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి దేవస్థానంలో నవంబర్ 3వ తేదీ మంగళవారం హుండీల లెక్కింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ) పి. కిషన్‌రావు వెల్లడించారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు ఈ లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధిత అధికారులు, ఆలయ సిబ్బంది హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. హుండీ లెక్కింపును పూర్తి పారదర్శకతతో నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఈఓ వివరించారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆసక్తి కలిగిన భక్తులు, ప్రజలు పాల్గొనవచ్చని ఆయన కోరారు.




లంచం ఇస్తేనే భూముల సర్వేనా?

రైతుల భూ సమస్యల పరిష్కారంలో సర్వే శాఖ నిర్లక్ష్యంపై ఆరోపణలు

విధులు నిర్వర్తించాల్సిన సిబ్బందిపైనే వసూళ్ల ఆరోపణలు

ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని రైతుల డిమాండ్



మన తొలివెలుగు । భీమదేవరపల్లి ప్రతినిధి కదిరె స్వామి । అక్టోబర్ 31, 2026 : రైతుల భూముల హద్దులు నిర్ణయించి, భూ వివాదాలకు పరిష్కారం చూపాల్సిన సర్వే శాఖలో కొందరు సిబ్బంది వ్యవహారశైలి విమర్శలకు తావిస్తోంది. హనుమకొండ జిల్లాలో భూముల సర్వే చేయించుకోవాలంటే లంచాలు ఇవ్వాల్సి వస్తోందని కొందరు రైతులు ఆరోపిస్తున్నారు. దరఖాస్తులు చేసుకున్నా సకాలంలో స్పందించకుండా కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూముల హద్దుల నిర్ధారణ, సర్వే నంబర్ల పరిశీలన, రికార్డుల ఆధారంగా ఖచ్చితమైన కొలతలు నిర్వహించడం సర్వేయర్ల ప్రధాన బాధ్యత. రైతుల మధ్య భూ వివాదాలు తలెత్తినప్పుడు ఇరువర్గాల సమక్షంలో నిష్పక్షపాతంగా సర్వే నిర్వహించి నివేదికలు సమర్పించాల్సి ఉంటుంది. ప్రభుత్వ భూములు, చెరువులు, రహదారుల హద్దులను గుర్తించడంలోనూ సర్వే శాఖ కీలక పాత్ర పోషించాలి. అయితే ఈ విధులు నిర్వర్తించాల్సిన కొందరు సిబ్బందిపైనే అక్రమ వసూళ్ల ఆరోపణలు రావడం అందోళన కలిగిస్తోంది. ఇప్పటికే భూ సమస్యలతో ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు పడుతున్న రైతులు సర్వే కోసం అదనపు మొత్తాలు చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు. లంచం ఇవ్వలేని సామాన్య రైతుల పనులు పెండింగ్‌లో పడుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. సర్వేలో పారదర్శకత లోపిస్తే భూముల హద్దుల విషయంలో మరిన్ని వివాదాలు తలెత్తే ప్రమాదం ఉంది. వాస్తవ కొలతలకు భిన్నంగా నివేదికలు రూపొందిస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. అందువల్ల ప్రతి దరఖాస్తును నిర్ణీత సమయంలో పరిష్కరించడంతో పాటు క్షేత్రస్థాయి సర్వేలను నిష్పక్షపాతంగా నిర్వహించాల్సిన అవసరం ఉంది.

కలెక్టర్ జోక్యం చేసుకోవాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్‌తో పాటు రెవెన్యూ, సర్వే శాఖ ఉన్నతాధికారులు ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని రైతులు కోరుతున్నారు. మండలాల వారీగా సర్వే దరఖాస్తులు, పెండింగ్ కేసులు, క్షేత్రస్థాయి నివేదికలను పరిశీలించి బాధ్యులుగా తేలిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ జీతాలు తీసుకుంటూ ప్రజలకు సేవ చేయాల్సిన ఉద్యోగులు రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు నిజమైతే అలాంటి వ్యవహారాలకు అడ్డుకట్ట వేయాల్సిందే. రైతులకు న్యాయం చేయాల్సిన సర్వే శాఖే వారికి ఇబ్బందిగా మారకూడదని, లంచాలకు తావులేకుండా పారదర్శకంగా భూ సర్వేలు నిర్వహించాలని రైతులు కోరుతున్నారు.

ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు అప్రమత్తత అవసరం

నీటి వృథాను అరికట్టి.. ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించాలి

31వ వార్డు కౌన్సిలర్ సుమయ్యా తబస్సుమ్ షఫీక్ అహ్మద్



మన తొలివెలుగు । యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి జంగిటి రవీందర్ । అక్టోబర్ 31, 2026 : ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో తాగునీటి కొరత ఏర్పడే అవకాశాలున్న నేపథ్యంలో ప్రజలు, అధికారులు ఇప్పటి నుంచే అప్రమత్తమై ముందస్తు చర్యలు చేపట్టాలని భువనగిరి పట్టణం 31వ వార్డు కౌన్సిలర్ సుమయ్యా తబస్సుమ్ షఫీక్ అహ్మద్ పిలుపునిచ్చారు. బంజారాహిల్స్‌లో నిర్వహించిన వార్డు సభలో ఎల్‌నినో ప్రభావం, తాగునీటి సమస్యల నివారణ, నీటి పొదుపు, ప్రత్యామ్నాయ నీటి వనరుల వినియోగంపై చర్చించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటిని వృథా చేయకుండా అవసరమైనంత మాత్రమే వినియోగించాలని, పైపులైన్ల లీకేజీలను గుర్తిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. వర్షపు నీటి సంరక్షణ, ఇంకుడు గుంతల ఏర్పాటు, నీటి వనరుల పరిరక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. వార్డు అధికారి గోలి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నీటి సంరక్షణపై అవగాహన పెంపొందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బానోత్ జ్యోతి, అనుషా, రెడ్డబోయిన రాజిత, సామల పద్మ, గుగులోతు దేవి, భూక్య పద్మ, జరపాల శారద, రామాదేవి, తాడూరి సత్తయ్య, బానోత్ సంతోష్, లక్ష్మయ్య, బానోత్ నరేందర్ కాళీ తదితరులు పాల్గొన్నారు.

డీజీపీ కార్యాలయంలో ఘనంగా వల్లభభాయ్ పటేల్ జయంతి

హైదరాబాద్ సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఐక్యత దినోత్సవం (రాష్ట్రీయ ఏక్తా దివస్) కార్యక్రమాన్ని శనివారం డీజీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీ (పిడ ఎల్) గజరావు భూపాల్ పోలీసు అధికారులు, సిబ్బందితో జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేయించారు. మల్టీ జోన్-ఎ ఐజీ చంద్రశేఖర్ రెడ్డి దేశ సమైక్యత, సమగ్రత కోసం సర్దార్ వల్లభభాయ్ పటేల్ చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యానంతరం సంస్థానాల విలీనంలో కీలక పాత్ర పోషించి దేశ ఐక్యతకు బలమైన పునాది వేశారని గుర్తుచేశారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ జాతీయ సమైక్యత, సమగ్రతను కాపాడేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐజీ (అడ్మిన్) అన్యోన్య, పలువురు పోలీసు అధికారులు, సీఏపోలు, ఏపోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తైక్వాండోలో గుర్రం కృష్ణకు గిన్నిస్ వరల్డ్ రికార్డు

తెలుగు విశ్వవిద్యాలయంలో ప్రశంసాపత్రం, మెడల్ అందజేత



మన తొలివెలుగు । యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి జంగిటి రవీందర్ । అక్టోబర్ 31, 2026: తైక్వాండో క్రీడలో అసాధారణ ప్రతిభతో అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటిన గ్రాండ్ మాస్టర్ గుర్రం కృష్ణ గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించి అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా అక్టోబర్ 30న హైదరాబాద్‌లోని శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు ప్రశంసాపత్రం, మెడల్ అందజేసి ఘనంగా సత్కరించారు. గత ఆగస్టు 9న హైదరాబాద్ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ప్రపంచంలోనే అతిపెద్ద తైక్వాండో పాఠం (లార్జెస్ట్ తైక్వాండో లెసన్) కార్యక్రమంలో మొత్తం 533 మంది క్రీడాకారులు పాల్గొని గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించారు. పూమ్సే, క్యూరీగి, పంచెస్, బ్లాక్స్, కిక్స్, సెల్ఫ్ డిఫెన్స్ వంటి విభాగాల్లో క్రీడాకారులు ఒకేసారి ప్రదర్శించిన విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో గ్రాండ్ మాస్టర్ గుర్రం కృష్ణతోపాటు తూర్పునూరి మల్లేశం, గుర్రం ధనమ్మ కూడా గిన్నిస్ రికార్డులో భాగస్వాములయ్యారు. ఈ విజయంపై రాష్ట్ర, జాతీయ, జిల్లా స్థాయి తైక్వాండో క్రీడాకారులు, రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు గ్రాండ్ మాస్టర్ ఎం. జయంత్ రెడ్డి, మహేశ్వర్, వహీజ్ అలీ ఖాన్, మారుతి, నరసింహ, హనుమంతు, శివప్రసాద్, భరత్ కుమార్ తదితరులు అభినందనలు తెలిపారు. గుర్రం కృష్ణ సాధించిన ఈ విజయం తైక్వాండో రంగానికి గర్వకారణమని, యువ క్రీడాకారులకు ఎంతో స్ఫూర్తినిస్తుందని క్రీడాభిమానులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

నీటి వృథాపై ఉక్కుపాదం

ఉల్లంఘిస్తే రూ.5 వేల జరిమానా!

23వ వార్డు సభలో కీలక తీర్మానాలు

వేసవి నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు



మన తొలివెలుగు । యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి జంగిటి రవీందర్ । అక్టోబర్ 31, 2026 : ఎల్‌నినో ప్రభావంతో రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఇందిరానగర్ 23వ వార్డులో కౌన్సిలర్ బర్రె పూజిత అధ్యక్షతన ప్రత్యేక వార్డు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి సంరక్షణకు పలు కీలక తీర్మానాలు చేశారు. కుళాయి నీటితో వాహనాలు కడగడం, పైపులతో వాకిళ్లు శుభ్రం చేయడం, నల్లాల ద్వారా నీటిని వృథా చేయడాన్ని నిషేధించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.5 వేల జరిమానా విధించాలని నిర్ణయించారు. ప్రతి ఇంటికి ట్యాప్‌లు బిగించుకోవాలని, పైపులైన్ల లీకేజీలను అరికట్టాలని, భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో వార్డులో నూతన బోరు ఏర్పాటు చేయడంతో పాటు బోయవాడ ప్రాథమిక పాఠశాల బోరు మరమ్మతులు, వాటర్‌లైన్ సంపు నిర్మాణానికి రూ.20 వేల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. మినీ వాటర్ ట్యాంకుల లీకేజీలను కూడా అరికట్టినట్లు వెల్లడించారు. ప్రజలందరూ నీటిని పొదుపుగా వినియోగించి వేసవి నీటి ఎద్దడి నివారణకు సహకరించాలని కౌన్సిలర్ బర్రె పూజిత, మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాశ్ రెడ్డి, ఏఈ రంజిత్, వార్డు అధికారి సయ్యద్ జావేద్, బండారు రవి వర్ధన్, మహిళా సంఘాల ప్రతినిధులు, వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయం వద్ద ట్యూబ్‌లైట్ల ఏర్పాటు



మన తొలివెలుగు, రేపల్లి ప్రతినిధి: మండల పరిధిలోని నాగపూర్ గ్రామంలో కొలువుదీరిన శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో దుర్గామాత యూత్ ఆధ్వర్యంలో శనివారం ట్యూబ్‌లైట్లను ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ఆలయ పరిసరాల్లో వెలుతురు ఉండేలా ఈ ఏర్పాటు చేసినట్లు యూత్ సభ్యులు తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గామాత యూత్ అధ్యక్షుడు నాగం మనోహర్ రెడ్డి, కమిటీ సభ్యులు లాలు, సాయి రెడ్డి, వార్డు నంబర్ శివ తదితరులు పాల్గొన్నారు. ఆలయ పరిసరాలను వెలుగులతో నింపిన యువత సేవాభావాన్ని గ్రామస్థులు అభినందించారు.

రాజ్యాంగ పరిరక్షణలో న్యాయవాదులదే కీలకపాత్ర

న్యాయవాదుల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలి

జస్టిస్ చంద్రకుమార్, కొల్లి సత్యనారాయణ



మన తొలివెలుగు । భువనగిరి రూరల్ ప్రతినిధి కే. నాగమణి । అక్టోబర్ 3, 2026 : రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య హక్కులు, న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాపాడటంలో న్యాయవాదులు కీలకపాత్ర పోషించాలని రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, ఐలు రాష్ట్ర అధ్యక్షుడు కొల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు. భువనగిరిలోని న్యూ వివేరా హోటల్‌లో శనివారం నిర్వహించిన ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా రెండో మహాసభల్లో భాగంగా 'రాజ్యాంగ పరిరక్షణ -- న్యాయవాదుల పాత్ర' అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ సామాన్యులకు సామాజిక న్యాయం అందేలా న్యాయవాదులు కృషి చేయాలని అన్నారు. కొల్లి సత్యనారాయణ మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని, జూనియర్ న్యాయవాదులకు ఐదేళ్లపాటు స్టైఫండ్, ఆరోగ్య, ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. బార్ కౌన్సిల్ సభ్యులు మందాడపు శ్రీనివాసరావు, వై. శ్రీనివాసరావు మహిళా, దివ్యాంగ న్యాయవాదులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఐలు జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ న్యాయవాదుల హక్కులు, ప్రజాస్వామ్య, లౌకిక విలువల పరిరక్షణకు ఐలు నిరంతరం పోరాడుతుందని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు బొల్లెపల్లి కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ న్యాయవాదులు, ఐలు నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి కళాశాలలో పటేల్ జయంతి వేడుకలు

ఐక్యతా ప్రతిజ్ఞ.. మత్తు పదార్థాలపై అవగాహన ర్యాలీ



మన తొలివెలుగు, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి జంగిటి రవీందర్ । అక్టోబర్ 31, 2026: లక్ష్మీనరసింహస్వామి డిగ్రీ కళాశాలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, నషాముక్త్ భారత్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రొఫెసర్ నాకోటి శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ ఐక్యత, సమగ్రతకు సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఐక్యతా స్ఫూర్తిని అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు భువనగిరి పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించి మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి. రమేష్ ఐక్యతా భావాన్ని కొనసాగించాలని పిలుపునివ్వగా, ప్రొఫెసర్ ఎం. శ్రీనివాస్ విద్యార్థులతో నషాముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

కల్తీ పాల కేంద్రాలను తక్షణమే సీజ్ చేయాలి!

నోటీసులతో సరిపెట్టొద్దు..

ప్రజారోగ్యంతో చెలగాటమాడితే కఠిన చర్యలు తప్పవు

తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్



మన తొలివెలుగు । భీమదేవరపల్లి ప్రతినిధి కదిరె స్వామి । అక్టోబర్ 31, 2026 : రాష్ట్రంలో కల్తీ ఆహార పదార్థాల తయారీ, విక్రయాలను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ డిమాండ్ చేశారు. రసాయనాలతో కృత్రిమ పాలు తయారు చేస్తున్నారనే వార్తలు అందోళన కలిగిస్తున్నాయని, చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వినియోగించే పాలలో కల్తీకి పాల్పడటం దారుణమని అన్నారు. పాలు, వంట నూనెలు, మసాలా దినుసులతో పాటు హోటళ్లు, స్వీట్ హౌస్‌లలో వినియోగించే ఆహార పదార్థాల నాణ్యతపై నిరంతరం తనిఖీలు నిర్వహించాలని కోరారు. కల్తీ జరిగినట్లు నిర్ధారణ అయితే నోటీసులతో సరిపెట్టకుండా సంబంధిత కేంద్రాలను సీజ్ చేసి, బాధ్యుల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజారోగ్యంతో చెలగాటమాడే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుని సురక్షితమైన ఆహారం అందేలా ప్రభుత్వం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని చెప్యాల ప్రకాష్ డిమాండ్ చేశారు.



‘ఈ నగరానికి ఏమైంది’ సీక్వెల్ ట్రైలర్ అప్‌డేట్..

వచ్చేస్తోన్న మ్యాడ్ గ్యాంగ్!

టాలీవుడ్ యువతను ఊపేసిన కల్ట్ హిట్ సినిమా ఈ నగరానికి ఏమైందికి సీక్వెల్‌గా వస్తున్న చిత్రం ‘ఈఎన్ఈ రీపీట్’ టాలెంట్ డైరెక్టర్ తరుణ్ భాస్కర్ తెరకెక్కించిన ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొనగా.. తాజాగా ఈ సినిమాకు సంబంధించి మేకర్స్ ఒక క్రేజీ అప్‌డేట్‌ను ప్రకటించి సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చారు. ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్‌ను నవంబర్ 3వ తేదీ సాయంత్రం 5:00 గంటలకు విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రంలో విశ్వక్ సేన్, అభినవ్ గోమటం, శ్రీకాంత్ మగంటి, వెంకటేష్ కాకుమాను తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సురేష్ ప్రొడక్షన్స్ పతాకంపై తెరకెక్కుతున్న ఈ సినిమాకు వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్నారు. కాగా, ఈ పూర్తి స్థాయి ఎంటర్‌టైనర్ సినిమా నవంబర్ 19, 2026 న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ట్రైలర్‌తో సినిమాపై మరింత హైప్ క్రియేట్ చేయడానికి చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది.

మ్యూజిక్ డైరెక్టర్‌పై క్లారిటీ.. అనిరుధ్, జీవీ ప్రకాష్‌లకు నో ఛాన్స్, బాలయ్య సినిమా అప్‌డేట్ ఇదే!



నందమూరి నటసింహం బాలకృష్ణ, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ చిత్రం చీదీఖ 112పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. బాలయ్య మాస్ ఇమేజ్‌కు కొరటాల శివ మార్క్ కథనం తోడైతే థియేటర్లలో అభిమానులకు పండగే అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో పూజా కార్యక్రమాలతో ఈ సినిమాను ఘనంగా ప్రారంభించారు. ఎస్ఎల్వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన సంగీత దర్శకుడి ఎంపికపై ఆసక్తికర చర్చ నడుస్తోంది. చీదీఖ 112కు సంగీతం అందించబోయే దర్శకుడు ఎవరనే విషయంపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో రకరకాల వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. తొలుత తమిళ స్టార్ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ ఈ ప్రాజెక్ట్‌కు పనిచేయబోతున్నారని ప్రచారం జరిగింది. అయితే ఆయన వరుస సినిమాలతో బిజీగా ఉండటంతో ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నట్లు కథనాలు వెలువడ్డాయి. ఆ తర్వాత అనిరుధ్ స్థానంలో మరో ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్‌ను తీసుకున్నారంటూ వార్తలు వచ్చాయి. దీంతో బాలయ్య సినిమాకు జీవీ ప్రకాష్ సంగీతం అందించబోతున్నారని అభిమానులు భావించారు. ఈ వార్తలు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం కావడంతో మ్యూజిక్ డైరెక్టర్ ఎంపికపై ఆసక్తి మరింత పెరిగింది. సంగీత దర్శకుడి ఎంపికపై వస్తున్న వరుస ప్రచారాలకు చిత్ర బృందం తాజాగా స్పందించింది. అనిరుధ్ రవిచందర్, జీవీ ప్రకాష్ కుమార్‌లలో ఎవరినీ ఇప్పటివరకు అధికారికంగా ఖరారు చేయలేదని స్పష్టం చేసింది. ప్రస్తుతం పలువురు సంగీత దర్శకులతో చర్చలు జరుగుతున్నప్పటికీ తుది నిర్ణయం తీసుకోలేదని అంటున్నారు.



పా. రంజిత్ ‘వేట్టువం’ రిలీజ్ డేట్ ఫిక్స్.. సంక్రాంతి 2027 బరిలో భారీ యాక్షన్ ఎపిక్!

సరికొత్త కథాంశాలతో సినిమాలను తెరకెక్కిస్తూ టాలీవుడ్, కోలీవుడ్‌లలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ దర్శకుడు పా. రంజిత్ తెరకెక్కిస్తున్న మోస్ట్ అంటెసిపేటెడ్ ప్రాజెక్ట్ ‘వేట్టువం’ విడుదలకు సంబంధించిన అఫిషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చేసింది. ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు మేకర్స్ ముహూర్తం ఫిక్స్ చేశారు. ప్రతిష్టాత్మకమైన సంక్రాంతి 2027 కానుకగా వచ్చే ఏడాది జనవరిలో ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఈ సినిమాకు సంబంధించిన గ్లింప్స్ అండ్ టీజర్ ఇప్పటికే సోషల్ మీడియాలో భారీ హైప్‌ను క్రియేట్ చేశాయి. ఇది ఒక ఇంటెన్స్ పోస్ట్-అపొకలిప్టిక్ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కుతోంది. హాలీవుడ్ కల్ట్ క్లాసిక్ మూవీ ‘మ్యాడ్ మాక్స్: ఫ్యూరీ రోడ్’ తరహా వైబ్స్ మరియు ఎలిమెంట్స్‌తో ఈ సినిమా ఉండబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. భూమి విధ్వంసం, కార్పొరేట్ సిండికేట్లు మరియు ప్రాచీన సంస్కృతికి మధ్య జరిగే పోరాట నేపథ్యంలో ఈ కథ సాగనుంది. ఈ చిత్రంలో టాలెంటెడ్ హీరో ఆర్య హీరోగా నటిస్తుండగా, శోభిత ధూళిపాళ వి.ఆర్. దినేష్ రవి కీలక పాత్రలు పోషిస్తున్నారు. వీరితో పాటు కలైయరసన్, గురు సోమసుందరం, జాన్ విజయ్, షాబీర్ తదితరులు ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. నీలం ప్రొడక్షన్స్ మరియు లెర్న్ అండ్ టీచ్ ప్రొడక్షన్ సంస్థలు సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ప్రముఖ సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి అదిరిపోయే మ్యూజిక్ అందిస్తున్నారు.

రామ్ చరణ్ - సుకుమార్ సినిమా ప్రారంభోత్సవానికి వేళాయె.. ఆసక్తికర పోస్ట్ పెట్టిన దర్శకుడి భార్య!



మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్, క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కలయికలో తెరకెక్కనున్న భారీ చిత్రం కోసం మెగా అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ‘రంగస్థలం’ వంటి సంచలన విజయం తర్వాత ఈ ఇద్దరూ మరోసారి కలిసి పనిచేస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన విషయం బయటకు వచ్చింది. రేపు ఈ చిత్రం ఘనంగా ప్రారంభం కానుండగా, అంతకంటే ముందే సుకుమార్ భార్య తబితా సుకుమార్ సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచింది.తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో తబితా సుకుమార్ ఈ సినిమా గురించి భావోద్వేగపూరితంగా స్పందించారు. సుకుమార్ భార్యగా ఈ ప్రాజెక్ట్ తనకు ఎంతో గర్వంగా, ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ సినిమా రచన కోసం సుకుమార్ ఎంత కష్టపడ్డారో, ఎన్ని గంటలు శ్రమించారో తనకు తెలుసని తెలిపారు. ఆయన పెట్టిన కష్టం, అభిరుచి, అంకితభావం ఇప్పుడు తెరపైకి రాబోతుండటం ఎంతో ప్రత్యేకంగా అనిపిస్తోందని ఆమె వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ కోసం సుకుమార్ ఎంతో సమయం కేటాయించి కథపై పనిచేశారని తబితా తన పోస్ట్‌లో వివరించారు. ఆయన రచనలో చూపించిన శ్రమ, పట్టుదల తనకు తెలుసని చెబుతూ.. ఆ కష్టం ఒక రూపం దాల్చడం చూడటం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. అంతేకాదు, ఎంతో అభిమానాన్ని సంపాదించుకున్న రామ్ చరణ్ -- సుకుమార్ కలయిక రెండోసారి ప్రేక్షకుల ముందుకు వస్తుండటంతో అంచనాలు మరింత పెరిగాయని తెలిపారు. తబితా పెట్టిన ఈ పోస్ట్ మెగా అభిమానులను ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా సుకుమార్ కథ కోసం ఇంతగా కష్టపడ్డారనే విషయం అభిమానుల్లో సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ గురించి రకరకాల వార్తలు ప్రచారంలో ఉండగా, తాజాగా దర్శకుడి భార్య చేసిన వ్యాఖ్యలు కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చాయి. ఈ సినిమా ప్రారంభోత్సవం రేపు ఘనంగా జరగనుంది. ఈ వేడుకతో ప్రాజెక్ట్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు బయటకు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా సినిమా ఏ తరహా కథతో తెరకెక్కనుంది? ఇందులో రామ్ చరణ్ పాత్ర ఎలా ఉండబోతోంది? అనే ప్రశ్నలకు కొంత స్పష్టత రావచ్చని అభిమానులు ఆశిస్తున్నారు. ‘రంగస్థలం’లో రామ్ చరణ్‌ను పూర్తిగా భిన్నమైన పాత్రలో చూపించి సుకుమార్ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఇప్పుడు మరోసారి వీరిద్దరూ జతకట్టడంతో ఈసారి ఎలాంటి కథను ఎంచుకున్నారనే ఆసక్తి నెలకొంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలు రేపటి వేడుకలో వెల్లడయ్యే అవకాశముంది.

PRINTED AND PUBLISHED BY KANUGULA SRINIVAS ON BEHALF OF VIPLAV MEDIA PUBLICATIONS. AT M/S SMIL YS ONLINE H.NO : 6-7-48 VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY DIST, TELANGANA - 500 O70 AND PUBLISHED AT VIPLAV MEDIA PUBLICATIONS. H.NO : 18-7-496 KANDIKAL GATE, UPPUGUDA, HYDERABAD, TELANGANA - 500 053. CEO & CHIEF EDITOR VANGA NAGARAJ REDDY (RAJU), EDITOR VANGA VIPLAV TEJA. PRGI : TGBIL/26/A2289. PHONE NO: +9184990 94183, +9193945 17067